సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 10-5-2024 15/-

## ప్రపంచవేదికపై పాలస్తీనా









గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 19 హైదరాబాద్
శుక్రవారం 10 మే 2024 రూ.15-00
1 జీఖఅదహ్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

ప్రతి వస్తువునూ శుభ్రపరచడానికి ఏదో ఒక సాధన ఉంది. హృదయాలను ప్రక్షాళన చేసేది అల్లాహ్ స్మరణ మాత్రమే.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. e-mail: geeturaiweekly@gmail.com





## లోపల...


| | |
|---|---|
| నారీ సమ్మాన్ ...... | 04 |
| ప్రపంచ వేదికపై పాలస్తీనా ...... | 05 |
| విచక్షణా ప్రమాణం–28 ...... | 08 |
| చరితార్థులు–2 : అబ్దుల్ రసూల్ ఖుర్బాన్ హుస్సేన్ ...... | 11 |
| కాజీ నజ్రుల్‌ను మరిచిపోయామా? ...... | 12 |
| జాత్యాహంకారం ...... | 15 |
| అవినీతి అంతమయ్యిందా? ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| మహా హక్కు మహత్తు మహా గొప్పది ...... | 24 |
| అబద్ధం చెప్పడం మానుకో ...... | 27 |
| ఇస్లాం పరిచయం ...... | 28 |
| కుటుంబ వ్యవస్థ ...... | 30 |
| ఈ సృష్టి అద్భుతం ...... | 33 |


**తాతా.. రెస్ట్ తీసుకో...**



కోటలు దాటుతున్న
మోై, షాల మాటలు
నమ్మకండి నాయనో
నీటి మీద మూటలు!
ఎలాగయిన ఈసారి
దింపుతరట తాతను
సీసాలోన బంధించి
బిగిస్తరంట మూతను!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## నారీసమ్మాన్

మహిళలపై అన్యాయాలు, అత్యాచారాల సంఘటనలు ఏవైనా జరిగినప్పుడు ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతాయి. కాని ఈ ఆగ్రహావేశాలు తాటాకు మంటలేనా? నిర్భయ కేసు తర్వాత పెల్లుబికిన కోపం ఆ తర్వాతేమయ్యింది. అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. నేటి సమాజంలో చేదువాస్తవమిది.

కర్నాటకలో ప్రజ్వల్ రేవన్న కేసు ఇప్పుడు బయటకు వచ్చింది. ఇప్పుడు కూడా ప్రజల్లో ఆగ్రహావేశాలు కనిపిస్తున్నాయి. డిసెంబర్ 2012లో నిర్భయపై అత్యాచారం, హత్యల తర్వాత దేశవ్యాప్తంగా ప్రదర్శనలు జరిగాయి. అప్పట్లో షీలా దీక్షిత్ ఢిల్లీ ముఖ్యమంత్రి. కాని ఢిల్లీలో పోలీసులపై ఆమె అధికారాలేమీ లేవు. కేంద్రప్రభుత్వ ఆజమాయిషీ ఉంటుంది. అయినప్పటికీ ఢిల్లీలో మహిళల భద్రతకు కల్పించలేకపోయారని ఆమెపై బీజేపీ నేతలు మండిపడ్డారు. షీలా దీక్షిత్ తర్వాత ఎన్నికల్లో ఓడిపోవడానికి ఇది కూడా ఒక కారణం. 2014 సాధారణ ఎన్నికల్లో యుపిఏ ఓటమికి కూడా ఇది ఒక కారణం అని చెప్పవచ్చు. ఈ స్థాయిలో ప్రజల ఆగ్రహావేశాలు చూసిన తర్వాత ఇక దేశంలో మహిళల భద్రత విషయంలో తప్పనిసరిగా మార్పు వస్తుందని చాలా మంది అనుకున్నారు. నిందితులకు శిక్ష పడడం మాత్రమే ముఖ్యం కాదు. మహిళలకు భద్రత కల్పించలేని పాలకపక్షంపై కూడా ప్రజలు ఆగ్రహించారు. కాని నిర్భయ తర్వాత కూడా అనేక సంఘటనలు జరిగాయి. రాజకీయ నాయకులు కూడా ఈ విషయం పట్టించుకున్నట్లు కనబడలేదు. నిర్భయ స్థాయిలో మరోసారి ప్రజల్లో ఆగ్రహావేశాలు కూడా కనబడలేదు.

కర్నాటక కేసు విషయానికి వస్తే, మాజీ ప్రధాని హెచ్ డీ దేవెగౌడ మనుమడు, కర్నాటకలో జనతాదళ్ సెక్యులర్ పార్లమెంటు సభ్యుడు. జనతాదళ్ సెక్యులర్ ఇప్పుడు బీజేపీ పంచన చేరింది. దేవెగౌడ మనుమడు కాబట్టి రేవన్న రాజకీయ వారసత్వం పొందాడు. ప్రధాని మోడీ స్వయంగా ఇతని కోసం ప్రచారం చేశారు. కాని రేవన్న రాజకీయాలు మాత్రమే చేయడం లేదు, అమాయక మహిళలపై అత్యాచారాలు చేసి వీడియోలు తీసే పని కూడా చేస్తాడన్నది బహుశా ప్రధానికి తెలియదు. అలా ఈ రేవన్న తీసిన వీడియోలు 3000 ఒక పెన్ డ్రైవ్‌లో ఉన్నాయి. వందలాది మహిళల జీవితాలతో ఆడుకున్నాడు. ఈ మహిళల్లో టీనేజి అమ్మాయిలు మొదలు 60 సంవత్సరాల వృద్ధ మహిళలు కూడా ఉన్నారు. సంవత్సరాల తరబడి గౌడ కుటుంబానికి సేవలందించి, రేవన్న తండ్రికి బాల్యంలో అన్నం తినిపిం చిన మహిళను కూడా రేవన్న వదలల్లేదు.

నిర్ఘాంతపరిచే వార్త ఇది. కాని ఈ వార్త ఇప్పుడే బయటకు వచ్చిందా? ఈ వీడియోలను రేవన్న వద్ద పనిచేసిన డ్రయివర్ లీక్ చేశాడని తెలిసింది. అతను ఈ వీడియోలను బీజేపీ నాయకుడు దేవరాజగౌడ్‌కు ఇచ్చాడట. దేవరాజ్ గౌడ్ బీజేపీ అధిష్ఠానానికి చెప్పానని అంటున్నాడు. 2023లోనే కర్నాటక బీజేపీ అధినేత విజయేంద్రకు చెప్పానని దేవరాజ్ అంటున్నాడు. అయినా రేవన్నకు టికెట్టు దొరికింది. పోటీ కూడా చేశాడు. ప్రధాని స్వయంగా ప్రచారం కూడా చేశారు. పోలింగు కూడా అయిపోయింది.

ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే రేవన్న మహిళలపై అత్యాచారాలు, వీడియోలు తీస్తున్న విషయం గురించిన పొగ ఎప్పటి నుంచో అలుముకుంటోంది. చాలా మందికి ఈ వాస్తవాలు తెలుసు. మరి బీజేపీ అధిష్ఠానానికి తెలియదా? అయినా రేవన్నకు టికెట్టు ఇచ్చి పోటీ చేయడానికి అవకాశం ఎలా కల్పించారు. ఈ వీడియోల గురించి కర్నాటకలోని కాంగ్రెసు ప్రభుత్వానికి తెలియదా? ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఇప్పుడు రేవన్న దేశం వదిలి పారిపోయాడు.

వాస్తవం ఏమిటంటే, మహిళలపై అత్యాచారాలు, వేధింపులు, దౌర్జన్యాలు, హత్యల సంఘటనలకు మన రాజకీయ నేతలు పెద్దగా ప్రాముఖ్యం ఇవ్వరు. దోషుల వ్యవహారం బయటపడి ప్రజల్లో ఆగ్రహం కనిపించకపోతే, దోషులను కాపాడ్డానికి, తమ రాజకీయ ప్రయోజనాలు చూసుకోడానికి పూర్తి ప్రయత్నం చేస్తారు. ప్రజల్లో ఆగ్రహం కనిపించినప్పుడు మాత్రం ప్రసంగాలు చేస్తారు.

ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకినప్పుడు, నిర్భయ కేసు మాదిరిగా జరిగినప్పుడు తాత్కాలికంగా ఏవో చర్యలు తీసుకున్నట్లు నటించి ప్రజలను మభ్యపెడతారు. కాని పరిస్థితి ఎలాంటిది అలాగే ఉంటుంది. ఎందుకంటే, మీడియా కూడా ఇలాంటి వార్తలపై తాము వత్తాసు పలుకుతున్న రాజకీయ పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే ప్రతిస్పందించడం ఇటీవల మామూలై పోయింది.

రాజకీయాల్లో విలువలు శూన్యమైనప్పుడు, మహిళల భద్రత అనేది కేవలం ఒక నినాదంగా మాత్రమే మిగులుతుంది. ఆధ్యాత్మిక విలువలను, నైతిక విలువలను మరిచిపోతే ఇలాంటి రాజకీయాలే నడుస్తుంటాయి.

★★★

అబ్దుల్ వాహెద్

# ప్రపంచవేదికపై పాలస్తీనా




**ఏప్రిల్ 18వ తేదీ** ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో పాలస్తీనాకు పూర్తి స్థాయి సభ్యత్వం ఇవ్వాలనే తీర్మానంపై ఓటింగ్ జరిగింది. అమెరికా సహజ స్వభావాన్ని మరోసారి ప్రదర్శించింది. రెండు దేశాల పరిష్కారం గురించి, ప్రపంచంలో మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువల గురించి ప్రసంగాలు చేసే అమెరికా జియోనిస్టు లాబీల ఉక్కు పాదాల క్రింద బతుకుతున్నానని రుజువు చేసుకుంది. ఈ తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. పాలస్తీనాను 140 దేశాలు గుర్తించాయి. భద్రతా మండలిలో ఉన్న 15 సభ్య దేశాల్లో 12 దేశాలు పాలస్తీనా సభ్యత్వానికి అనుకూలంగా ఓటు వేశాయి. బ్రిటన్, స్విట్జర్లాండ్ దేశాలు ఓటింగులో పాల్గొనలేదు. ఒకే ఒక్క దేశం అమెరికా ఈ తీర్మానాన్ని వ్యతిరేకించడమే కాదు, వీటో కూడా చేసి పాలస్తీనాకు సభ్యత్వం లభించకుండా అడ్డుకుంది. చివరకు అమెరికా మిత్రదేశాలైన ఫ్రాన్సు, జపాన్, దక్షిణ కొరియాలు కూడా ఈ తీర్మానాన్ని బలపరిచాయి. కాని అమెరికాకు యూద లాబీని కాదని ఈ తీర్మానాన్ని బలపరిచే ధైర్యం లేదు. అమెరికా ఎన్నికల్లో నేతలకు కావలసిన నిధులు ఈ యూద లాబీ నుంచే లభిస్తాయన్నది మరిచిపోరాదు.

పాలస్తీనాకు ఒక ప్రత్యేకదేశం హోదాను ఐక్యరాజ్యసమితి సాధారణ సభ నవంబర్ 2012లోనే గుర్తించింది. అప్పుడే పాలస్తీనాకు సభ్యత్వం లేని పరిశీలక హోదాను కూడా ఇచ్చింది. ఇప్పుడు పాలస్తీనాకు పూర్తిస్థాయి సభ్యత్వం ఇవ్వాలన్న తీర్మానాన్ని ఆల్జీరియా ప్రతినిధి ప్రవేశపెట్టారు.

ఐక్యరాజ్యసమితిలో ఇస్రాయీల్ రాయబారి మాట్లాడడం ప్రారంభించగానే రష్యా వాకౌట్ చేసి నిరసన ప్రదర్శించింది. రష్యా రాయబారి అమెరికా వైఖరిని తీవ్రంగా నిరసించారు. గాజాలో నరమేధం ప్రారంభమైన తర్వాత ఇప్పటికి ఐదుసార్లు ఐక్యరాజ్యసమితిలో అమెరికా వీటో అధికారాన్ని ఉపయోగించిందని, పాలస్తీనా పట్ల అమెరికా వైఖరి ఏమిటో దీనివల్ల స్పష్టంగా తెలుస్తుందని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక దేశాలు, ప్రజలు పాలస్తీనాను సమర్థిస్తున్నారని కూడా ఆయన చెప్పారు. చరిత్ర గమనాన్ని ఆపడానికి ఇప్పుడు అమెరికా చేసిన ఈ వీటో ప్రయత్నం చివరకు నిష్ఫలంకాక తప్పదని కూడా ఆయన అన్నారు. ప్రపంచంలో ఒక్క అమెరికా తప్ప మరెవ్వరు ఇప్పుడు ఇస్రాయీల్‌ను సమర్థించడం లేదని విమర్శించారు.

పాలస్తీనా భూభాగాన్ని యూదులకిచ్చి ఇస్రాయీల్ ఏర్పాటు చేసిన బ్రిటన్ బయటి దేశాల నుంచి యూదులు వచ్చి అక్కడ స్థిరపడే అవకాశాలు కల్పించడమే కాదు, ఇస్రాయీల్‌కు ఐక్యరాజ్య సమితిలో సభ్యత్వం కూడా వచ్చేలా ఈ అగ్రరాజ్యాలు చేశాయి. కాని ఈ భూభాగానికి అసలు వారసులయిన పాలస్తీనా ప్రజలపై నరమేధం కొనసాగిస్తున్నారు. 1947లోనే ఐక్యరాజ్య సమితి ఈ భూభాగాన్ని రెండు దేశాలుగా గుర్తించాలని తీర్మానం చేసింది. 1948 నుంచి ఇస్రాయీల్‌కు పూర్తిస్థాయి సభ్యత్వం ఉంది. పాలస్తీనాకు పూర్తిస్థాయి సభ్యత్వం కోసం ఎప్పటి నుంచో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పుడు ఈ తీర్మానాన్ని వీటో చేసినా తాము నిరాశ చెందేది లేదని పాలస్తీనా ప్రతినిధులు ప్రకటించారు.

ఇస్రాయీల్ ఏది కోరుతుందో అమెరికా అదే చేస్తుందన్నది మరోసారి రుజువయ్యింది. కాని పైకి మాత్రం రెండు దేశాల పరిష్కారం అంటూ నీతులు చెబుతుంది. మరోవైపు ఇస్రాయీల్ ప్రత్యేక పాలస్తీనా దేశం ఏర్పడకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. అమెరికా దానికి సహాయం చేస్తూనే ఉంటుంది.

కాని ఈ ప్రయత్నాలను ప్రపంచం గమనిస్తూనే ఉంది. పాలస్తీనాకు అనుకూలంగా అమెరికా విశ్వవిద్యాలయాల్లోనే ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు ఇస్రాయీల్ చేసిన దాడుల్లో గాజాలో 35 వేల మంది మరణించారు. మరణించిన వారిలో అత్యధిక సంఖ్యలో పిల్లలు, మహిళలు ఉన్నారు. ఇది యుద్ధం కాదు. నరమేధం. గాజాపై యుద్ధం ప్రారంభించిన ఇస్రాయీల్ హమాస్ ను తుడిచేస్తానని చెప్పింది. కాని హమాస్ బలం ఎలాంటిదలాగే ఉందని వార్తల వల్ల తెలుస్తోంది. ఇస్రాయీల్ యుద్ధం పేరుతో చేస్తున్నది సాధారణ ప్రజలను చంపడం. ఆసుపత్రులపై బాంబులు వేసి చేసిన నరమేధం ప్రపంచం గుర్తించింది. ఇప్పుడు ఇస్రాయీల్ ప్రధానిపై యుద్ధ నేరాల కేసు నడుస్తోంది. గాజాలో ఇస్రాయీల్ చేస్తున్న మారణ హోమాన్ని యావత్తు ప్రపంచం నిరసిస్తోంది. అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన ఈ నిరసన ప్రదర్శనల్లో దాదాపు 16వందల మంది విద్యార్థులు అరెస్టయ్యారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు ప్రపంచ వ్యాప్తంగా ఈ నిరసనలు పెల్లుబుకుతున్నాయి.

కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన పాలస్తీనా అనుకూల నిరసనలు కార్చిచ్చులా వ్యాపిస్తున్నాయి. ఈ నిరసనలను పరిశీలిస్తే అమెరికా సమాజంలో తరాల అంతరం తెలుస్తుంది. ముఖ్యంగా ఇస్రాయీల్‌కు మద్దతు విషయంలో పాత తరానికి, కొత్త తరానికి మధ్య విభేదాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. నేటి యువతరం పాలస్తీనాపై జరుగుతున్న ఘోరాలను గుర్తిస్తున్నారు. పాలస్తీనాకు మద్దతుగా గొంతు విప్పుతున్నారు. ఈ నిరసనల సెగ డెమొక్రటిక్ పార్టీకి చెందిన అధ్యక్షుడు జో బిడెన్‌కు కూడా తగలక తప్పదని రాజకీయ వ్యాఖ్యాతలు భావిస్తున్నారు. అంతేకాదు ఇస్రాయీల్ విషయంలో గుడ్డిగా మద్దతిచ్చే అమెరికా రాజకీయ నాయకులపై కూడా దీని ప్రభావం పడుతుంది. కొత్తతరం ఈ అన్యాయాలను సహించడం లేదు. కొలంబియా విశ్వవిద్యాలయంలో పాలస్తీనా అనుకూల నిరసనకారులు అక్కడే శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. వారిని అరెస్టు చేయగానే ఈ నిరసనలు ఇతర విశ్వవిద్యాలయాలకు


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

వ్యాపించాయి. విద్యార్థులను, అధ్యాపకులను అరెస్టు చేయడంలో పోలీసులు ప్రదర్శించిన జులుం కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశం అయ్యింది. ఇస్రాయీల్ సైన్యానికి అమెరికా విశ్వవిద్యాలయాలకు సంబంధమేమిటన్నది ప్రశ్న. చాలా సంబంధం ఉంది. ఇస్రాయీల్ మిలటరీతో సంబంధం ఉన్న ఆయుధాల తయారీ సంస్థల నిధులను వెంటనే ఉపసంహరించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

అమెరికాలో యువతరం పాలస్తీనాను సమర్థించడం చాలా కాలంగా ఉంది. చాలా ఒపీనియన్ పోల్స్ లోను ఈ విషయం తెలిసింది. పాతతరంలో ఇంకా ఇస్రాయీల్ పట్ల సానుభూతి ఉంది. కాని కొత్త తరం ఇస్రాయీల్ దౌర్జన్యాలను నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నారు.

అమెరికా విశ్వవిద్యాలయాలు దేశంలో కీలకమైన మార్పులకు కారణమైన చరిత్ర ఉంది. ఉదాహరణకు దక్షిణాఫ్రికాలో జాత్యాహంకార ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1950లలో ప్రారంభమైన ఉద్యమం చివరకు 1980ల్లో జాత్యాహంకార వ్యతిరేక నిరసనలుగా మారింది. చివరకు దక్షిణాఫ్రికాలో జాత్యాహంకార నిర్మూలనకు ఈ ప్రదర్శనలు తోడ్పడ్డాయి. 1960ల్లో పౌర హక్కుల ప్రదర్శనలు జరిగాయి. ప్రజాభిప్రాయాన్ని మలచడంలో అమెరికా విశ్వవిద్యాలయాలు తమ పాత్ర పోషించిన చరిత్ర ఉంది.

పాలస్తీనా అనుకూల నిరసనలపై పోలీసుల బలప్రదర్శన కూడా ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. బాహాటంగా నిరసనకారులు హమాస్‌కు మద్దతివ్వడం కూడా చర్చకు వచ్చింది. ప్రభుత్వ దమననీతి ముందు విద్యార్థులు కూడా తలొగ్గడం లేదు. ప్రదర్శనలు మరింత పెరుగుతున్నాయి.

అక్టోబర్ 7వ తేదీన ఇస్రాయీల్‌పై హమాస్ దాడి చేసిన తర్వాతి నుంచి అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఇస్రాయీల్, పాలస్తీనాల చర్చ జరుగుతోందన్నది కూడా గమనించాలి. ఇస్రాయీల్ గాజాపై దాడి చేసి హమాస్‌ను అంతం చేస్తానని చెప్పింది. కాని ఇస్రాయీల్ దాడుల్లో వేలాది పిల్లలు, మహిళలు చనిపోతున్నారే కాని హమాస్ బలం ఎలాంటిది అలాగే ఉందన్నది కూడా చాలా మంది విశ్లేషించారు. ఇస్రాయీల్ చేస్తున్నది యుద్ధం కాదు పాలస్తీనా ప్రజలను నిర్మూలించే జాతి నిర్మూలన అని చాలా మంది ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అమెరికా విశ్వవిద్యాలయాల్లో గాజాకు అనుకూలంగా ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి.

ఈ ప్రదర్శనలను అణిచేయడానికి జియోనిస్టు శక్తులు రంగంలోకి దిగాయి. విశ్వవిద్యాలయాలను టెర్రరిస్టుల అడ్డాలుగా ప్రచారం చేయడం, యాంటి సెమిటిక్ ప్రదర్శనలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేశారు.

అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఇప్పుడు జరుగుతున్న పాలస్తీనా అనుకూల ప్రదర్శనలు అరవైల్లో వియత్నాం యుద్ధంలో జరిగిన యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలను గుర్తుకు తెస్తున్నాయి. ఈ నిరసనలు, ప్రదర్శనలు అమెరికా సమాజం ఇప్పుడు రెండుగా చీలిపోయిందని చెబుతున్నాయి. అమెరికా ప్రభుత్వం, రాజకీయ నాయకులు ఇస్రాయీల్‌కు గుడ్డిగా ఇస్తున్న మద్దతును వేలెత్తి చూపించడమే కాదు, నిర్భయంగా ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలు ప్రపంచ వేదికపై పాలస్తీనాను సరికొత్తగా పరిచయం చేస్తున్నాయి. ప్రపంచం మరిచిపోయిన అన్యాయాలు, దౌర్జన్యాలు, ఏడు దశాబ్దాల అణిచివేతలు, జాతిహననాలు, ఊచ కోతలు, నిర్బంధాలు అన్నీ ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. ఈ చర్చ న్యాయం చేస్తుందని ఆశిద్దాం. ✤


గీటురాయి వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.

## ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్‌ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

అధ్యాయం -10

28

# విచక్షణా ప్రమాణం

ఎస్.ఎమ్. మలిక్

## 1. సంస్కరణలు

### బానిసత్వ నిర్మూలన

ఒకసారి సీరీన్ అనే బానిస మహనీయ అనస్(ర)ను తన హక్కును, విడుదల కొరకు 'మకాతబత్'ను అభిలషించారు. సీరీన్ వద్ద పుష్కలంగా డబ్బు ఉంది. అందుకే మహనీయ అనస్ ఆయన కోరికను తిరస్కరించారు. సీరీన్ ఖలీఫా మహనీయ ఉమర్(ర) వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. మహనీయ ఉమర్ ఫారూక్, బానిస అనీ అతని స్వామి అనీ తారతమ్యం పాటించకుండా, బానిస హక్కును గుర్తించి మహనీయ అనస్‌ని మకాతబత్ చేసుకోవలసిందని కోరారు. ఆయన మళ్ళీ తిరస్కరించారు. మహనీయ ఉమర్ ఆయన్ని ఒప్పించడానికి కొరడా ఝుళిపించి, ఆధారంగా ఈ ఆయత్ వినిపించారు,

మీ బానిసల్లో మకాతబత్ ని అభ్యర్థించే వారితో మకాతబత్ చేసుకోండి, వారిలో శుభమే ఉందని మీరు గ్రహిస్తే.

*(అన్ నూర్ 24: 33)*

మహనీయ ఉమర్ నోట ఈ దైవాదేశం వినగానే మహనీయ అనస్ సీరీన్‌తో మకాతబత్ చేసుకున్నారు. ఆ నిర్ణీత ధనం చెల్లించి సీరీన్ విడుదల పొందారు. హక్కుదారుకు హక్కు లభించి న్యాయం జరిగింది.

### ఆర్థిక వ్యవస్థ

ఒక రోజు ఖలీఫా మహనీయ ఉమర్(ర) బజారుకు వెళ్ళారు, అక్కడ ఆయన, వ్యాపారుల వద్ద అక్రమ నిల్వలు విస్తారంగా ఉండటం గమనించారు. అప్పుడు ఆయన అధికారికంగా ప్రకటించారు,

"ఇలా జరగటం అసహనీయం. దైవం మన వద్దకు నిత్యావసర సరుకులు పుష్కలంగా పంపినా అవి బజారుల్లోకి వచ్చిన తరువాత మన వ్యాపారులు వాటిని అవసరార్థులు, అనాథలు, నిరుపేదలకు అందకుండా నిల్వ జేసి, బజారులో సరఫరా లేనప్పుడు ఇష్టమయిన అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నేను ఇందుమూలంగా ప్రకటిస్తున్నాను, నేటి తరువాత ఎవరయినా సరే, బయటి నుంచి మన బజారుల్లోకి సరకు తెచ్చినప్పుడు, అది శీతాకాలమయినా, వేసవి అయినా తొందరపాటుతో విక్రయించి వెళ్లిపోరాదు. నింపాదిగా అందరికీ సరకు అందుబాటులోకి తెచ్చి విక్రయించుకోవాలి."

### విపణీ వీధులు

బజారుల్లో వ్యాపారులను నిశితంగా పరిశీలించడానికి

పర్యవేక్షకులను నియమించారు మహనీయ ఉమర్(ర). ఆయన తన కాలంలో సులైమాన్ బిన్ హస్మని వాణిజ్య వ్యవహారాల ఇంచార్జీ గాను, సాయిబ్ బిన్ యజీద్, ఉత్బా బిన్ మస్ఊద్ ని ఆయన సహాయకులుగా నియమించారు. ఇలా వాణిజ్య విభాగం నెలకొల్పడం వల్ల ప్రజలకు ఎంతో సౌకర్యం లభించింది. దీని ద్వారా ఇస్లామ్ ప్రగతి పథాన ఆటంకం కాదని, ఇస్లామీయ జీవన వ్యవస్థ మానవ జీవితాన్ని సకల రంగాలలో దారి చూపే మార్గదర్శి అని,ఇంకా అది సర్వ కాలాలలో ఆచరణీయమని రుజువయింది.

ఆయన స్వయంగానూ భుజాన కొరడా పెట్టుకుని బజారుల్లో సంచరిస్తూ దుర్వ్యవహారాల పట్ల అతి కఠిన చర్యలు తీసుకునేవారు. ఆ సందర్భాలలో ఆయన ఖలీఫా అయినప్పటికీ, ఒక ఉల్లేఖనం ప్రకారం, 14 అతుకులలో ఒకటి తోలు అతుకు ఉన్న చొక్కా ధరించి భుజాన కొరడాతో బజారుల్లో పర్యవేక్షించేవారు. ఒకసారి బజారులో ఓ వ్యక్తి పాలల్లో నీరు కలిపి అమ్ముతున్నాడు. అది గమనించి ఆయన అతని పాలంతా పారబోశారు!

## కళాకారుల సత్కారం

ఆయన కాలంలో ఉన్న కళాకారులు, కవులు, ప్రసంగ కర్తలు, వంశావళుల నిపుణులు, పైల్వానులు, వీరులు ఇంకా ఇతర ప్రావీణ్యం గలవారు ఆయన వద్ద సత్కారం పొందారు. ఇద్దరు వీరయోధులు ఎంతో వినుతికెక్కిన వారు, తల్హా బిన్ ఖువైలిద్, అమ్ర్ బిన్ మఅదీ కర్బ్ రెండేసి సిపాయీలకు ధీటుగా సమాధానం ఇవ్వ గలవారు. వారిని మహనీయ ఉమర్(ర) పిలిపించి గౌరవాదరణలతో సత్కరించారు. వారిద్దరిని ఆయన కాదిసియ రంగానికి పంపుతూ, మహనీయ సఅద్‌కు, "నేను రెండు వేల బలగాలను నీకు పంపుతున్నాను" అని వ్రాశారు.

అమ్ర్ బిన్ మఅదీ కర్బ్ పైల్వాన్ కావడమే కాక, మంచి వక్త, కవి కూడా. మహనీయ ఉమర్ తరచుగా యుద్ధ విద్యను గురించి చర్చించే వారు. ఒక సందర్భంలో అరబ్బు తెగలను గురించి, యుద్ధం, ఆయుధాలను గురించి ప్రశ్నలు ఒక్కొక్క దానికి అమ్ర్ ఇచ్చిన సంగ్రహ సమాధానాలు చరిత్ర గ్రంథాల్లో నిక్షిప్తమయి ఉన్నాయి.

## దైవభీతి గలవారి ఆదరణ

ఒకసారి మహనీయ ఉమర్(ర) రాత్రి వేళ తన నౌకరు అస్లమ్ తో గస్తీ తిరుగుతున్నారు. అలసిపోయి ఒక చోట గోడకు ఆనుకుని సేద తీరుతున్నారు. కాస్సేపటికి ఓ మహిళ కంఠం వినిపించింది, ఆమె తన కూతురుతో, పాలల్లో కొంత నీరు కలపమని అంటోంది.

దానికి ఆ అమ్మాయి, "అమీరుల్ మూ'మినీన్ ఆదేశం మీకు తెలియదా?" అని అడిగింది.

ఆ మహిళ, "ఏమిటా ఆదేశం?"

అమ్మాయి, "ఆయన పక్షాన ప్రకటన జరిగింది, ఇకపై ఎవ్వరూ పాలల్లో నీరు కలపరాదని."

మహిళ, "నీవు నా మాట విని పాలల్లో నీరు కలుపు, ఇక్కడ ఉమర్ అయినా చూడటం లేదు ఆ ప్రకటన చేసిన వారయినా లేరు."

అమ్మాయి, "అమ్మా! అలా వీల్లేదు, ఆయన చూడటం లేదని ఆయనకు అవిధేయత చూపడం నా వల్ల కాదు, దైవం చూడటం లేదా?"

మహనీయ ఉమర్(ర) ఈ మాటలన్నీ శ్రద్ధగా విన్నారు. ఆయన తన నౌకరుతో, "ఈ తలుపు మీద గుర్తు పెట్టు, ఇంకా ఈ చోటు గుర్తుంచుకో" అని చెప్పి ముందుకు సాగారు.

మరుసటి రోజు ఉదయం మహనీయ ఉమర్ తన నౌకరు అస్లమ్‌ను పంపి, ఆ మాట పలికిందెవరో, ఎవరితో పలికారో ఆరా తీసి ఆ అమ్మాయి వివాహం అయిందో లేదో కూడా తెలుసుకుని రమ్మని ఆదేశించారు. అస్లమ్ అక్కడికి వెళ్లి సమాచారం సేకరించి వచ్చారు. ఆ అమ్మాయికి పెళ్లి కాలేదని, ఆమె పేరు ఉమ్మె అమ్మారా బిన్తు సుఫ్యాన్ బిన్ అబ్దుల్లా అని, ఆమె మాట్లాడింది తన తల్లితో అని మొత్తం రిపోర్టు మహనీయ ఉమర్(ర)కు ఇచ్చారు. అప్పుడు ఆయన తన కుమారుల్ని అందరినీ సమావేశపరచి, "మీలో ఎవరయినా పెళ్ళి కావలసిన వారున్నారా? నేను ఆ అమ్మాయితో అతని పెళ్ళి జరిపించడానికి?" అని అడిగారు.

ఇద్దరు పెద్ద కుమారులు, తమ పెళ్ళి అయిందని చెప్పారు. కాగా మూడవ వారు ఆసిమ్, ఆ అమ్మాయితో తన పెళ్ళి జరిపించమని కోరుతారు. అలాగే మహనీయ ఉమర్, పెళ్ళి సంబంధానికి సందేశం పంపి ఆ అమ్మాయితో ఆసిమ్ పెళ్ళి జరిపించారు. ఆ గుణవంతురాలి సంతతి లోనే ప్రఖ్యాత ఖలీఫా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ రహ్మతుల్లాహ్ అలైహ్ (క్రీ. శ. 682-720) జన్మించారు!

## అవసరార్థికి సహకారం!

మహనీయ ఉమర్ గస్తీలో ఉండగానే ఓ ఖాళీ స్థలంలో

కొత్తగా ఒక గుడారం కనిపించింది. కాస్త ముందుకు వెడితే అందులో నుంచి స్త్రీ రోదన వినిపించింది. అక్కడ ఓ వ్యక్తి కూడా కూర్చుని ఉన్నాడు. ఖలీఫా అతనికి సలామ్ చేశారు. నీవెవరివి? అని ప్రశ్నించారు. "నేను ఓ పల్లె వాసిని, అమీరుల్ మూ'మినీన్ వద్దకు వచ్చాను, ఆయన ద్వారా ఏదయినా ప్రాప్తిస్తుందన్న నమ్మకంతో. ఉమర్ అతన్ని అడిగారు, లోపలి నుంచి వచ్చే మూలుగు శబ్దం ఎవరిదీ అని. అతను, "దైవం మిమ్మల్ని కరుణించుగాక, ఆమెకు సహాయం అవసరం" అన్నాడు. "చెప్పండి నేను సిద్ధమే" అన్నారు మహనీయ ఉమర్.

"కాని, మనం ఆవిడకు ఎలా సహాయ పడగలం? ఆమె నా భార్య, ప్రసవ వేదనలో ఉంది" అన్నాడు ఆ వ్యక్తి. "ఆమె దగ్గర ఎవరయినా మహిళ ఉన్నారా?" అడిగారు ఉమర్(ర). "లేదు" అతను చెప్పాడు. ఆయన వెంటనే తిరిగి ఇంటికి వెళ్లి తన భార్య, అలీ(ర) కుమార్తె ఉమ్మె కుల్సూమ్‌కు, అంతా వివరించి, ఆమెను, ప్రసవానికి, భోజనానికి అవసర మయిన సామగ్రి, ఓ పాత్ర కూడా తీసుకుని ఆ గుడారానికి చేరారు. ఆమెను లోనికి పంపించి తాను ఆ వ్యక్తి వద్ద కూర్చుని అతనికి పొయ్యి వెలిగించమన్నారు. పొయ్యి పైన పాత్ర పెట్టి భోజనం తయారు చేశారు.

కాస్సేపటికి ఆ మహిళ ప్రసవం జరిగింది. మహనీయ కుల్సూమ్, పిలిచి "అమీరుల్ మూ'మినీన్! మీ మిత్రునికి పుత్రుని శుభ వార్త తెలుపండి" అన్నారు. ఆ పల్లె వాసి, 'అమీరుల్ మూ'మినీన్' అన్న మాట వినగానే ఉలిక్కిపడ్డాడు, దూరం జరగ సాగాడు. ఉమర్ అతనికి అభయమిచ్చి నింపాదిగా కూర్చోమన్నారు. ఆ తరువాత ఆయన భోజన పాత్ర గుమ్మంలో పెట్టి మహనీయ కుల్సూమ్‌ని పిలిచి, ఆ మహిళకు భోజనం చేయించ మన్నారు. ఆమె ఆదేశ పాలన చేసి తిరిగి ఆ పాత్ర గడప వద్ద పెట్టేశారు. మహనీయ ఉమర్(ర) ఆ పాత్ర ఆ వ్యక్తికి అప్పజెప్పి, "నీవు రాత్రంతా మేల్కొనే ఉన్నావు, భోంచెయ్యి" అని చెప్పి తన భార్యను బయటికి వచ్చెయ్యి అని చెప్పారు. ఆ పల్లె వాసికి, "రేపు మా వద్దకు వచ్చెయ్యి, నీ అవసరాలేమిటో చూద్దాము" అన్నారు.

మరుసటి రోజు ఆ పల్లె వాసి ఖలీఫా వద్దకు వచ్చినప్పుడు ఆయన అతని పిల్లవాని పేరు రిజిస్టర్ లో నమోదు చేయించి వాని భత్యం నిర్ణయించారు.

## ప్రథమ సేవకుడు!

ఒకసారి ఖలీఫా మహనీయ ఉమర్(ర) రాత్రి వేళ నగరంలో గస్తీ తిరుగుతున్నప్పుడు ఓ చోట ఓ స్త్రీ నీటి తిత్తి భుజాన ఎత్తుకుని నడుస్తూ కనిపించింది. ఈ అపరాత్రి ఇంటి నుంచి బయటకు రావలసిన అవసరం ఏమిటని ఆశ్చర్యపోయారు. ఆమెనే అడిగారు. ఆమె ఆయన్ని గుర్తు పట్ట లేదు, కాగా ఆమె దానికి, "నాకు చిన్న చిన్న పిల్లలు ఉన్నారు. నీరు తెచ్చి పెట్టేవారెవరూ లేరు, నేనే రాత్రి వేళ బయటికి రావలసి ఉంటుంది, పగలు బయటికి రావడం నాకు నచ్చదు" అని చెప్పుకుంది. ఆయన ఆ నీటి తిత్తి భుజాన ఎత్తుకుని ఆమె ఇంటికి చేర్చారు. ఇంకా ఇలా అన్నారు, "నీవు ఉదయం అమీరుల్ మూ'మినీన్ వద్దకు వచ్చెయ్యి ఆయన ఏదైనా ఏర్పాటు చేస్తారు."

"ఉమర్ మనకు ఎక్కడ దొరుకుతారయ్యా?" అని సంశయం వెలిబుచ్చిందావిడ. "నీవు రానయితే రా, ఆయన తప్పక కలుస్తాడు" అన్నారాయన. ఆమె వచ్చి ఆయన్ని చూసి ఆశ్చర్య పోయింది, "అరె, ఈయన ఆయనే, నా తిత్తి తెచ్చి పెట్టిన వ్యక్తి!" అనుకుంటూ వెను తిరిగింది. మహనీయ ఉమర్ వెంటనే ఆమెను రప్పించి ఆమె కొరకు ఓ నౌకరు ఏర్పాటు చేశారు.

## ఇహ పరాలు తోడుగా

మహనీయ ఉమర్(ర) తనకు ఎదురయ్యే సంకటం గురించి ఇలా చెప్పుకున్నారు, "నేను పాపిష్టుల్లోని సామర్థ్యాలు, సజ్జనుల్లోని అసమర్థత, అవజ్ఞతల పట్ల దైవానికే మొర పెట్టుకుంటున్నాను. నేను వాస్తవానికి భయభక్తులు గల వారికే పదవులు ఇవ్వాలని కోరుకుంటాను కాని వారిలో వ్యవహార అవగాహన, పరిస్థితుల్ని అదుపు చేయగల సామర్థ్యం కొరవడి ఉంటాయి. గత్యంతరం లేక వారి కన్నా సౌజన్యం కొరవడిన వారినే నియమించ వలసి వస్తుంది". ఇంకా ఇలా అన్నారు,

"ఎవరయితే చెడు ఏమిటో ఎరుగరో వారు, చెడులో ఇరుక్కు పోయే ప్రమాదం అధికంగా ఉంటుంది. అయితే నేను ఎవరినీ వంచించను, నన్నూ ఎవరున్నూ వంచించలేరు. ఇంకా దైవం ఇచ్చిన ఆదేశాలకుగాను వాటిని పాలించ గోరే వారికి సహాయమూ అందజేస్తాడు దైవం. అలాగే దైవం దేన్ని వారిస్తాడో దాన్నుండి తప్పించుకోదలచిన వారికి ఆ సద్బుద్ధినీ అనుగ్రహిస్తాడు, మార్గమూ సుగమం చేస్తాడు."

మరో సందర్భంలో ఇలా కూడా అన్నారు, "ఇస్లామ్ స్వీకరించిన వారిలో అజ్ఞానం అంటే ఏమిటో ఎరుగని వారు జన్మించినట్లయితే ఇస్లామ్ అనుబంధాలు ఒక్కొక్కటే తెంచి వేయడం జరుగుతుంది".

## 'చరితార్థులు'-2



# అబ్దుల్ రసూల్ ఖుర్బాన్ హుస్సేన్

## (1910-1931)

45



'స్వాతంత్ర్యం, స్వదేశీ వస్తు వాడకం, హిందూ–ముస్లిం ఐక్యత, సమానత్వం, సామ్యవాదం'లను తన పంచశీల సూత్రంగా భావించి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరుబాటను ఎంచుకున్న అబ్దుల్ రసూల్ ఖుర్బాన్ హుస్సేన్ మహారాష్ట్ర లోని షోలాపూర్‌లో 1910లో జన్మించారు. చిన్న వయస్సులో లోకమాన్య బాలగంగాధర్ తిలక్, మహాత్మా గాంధీలతో అబ్దుల్ రసూల్ ప్రభావితమయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో సభ్యత్వం స్వీకరించి స్థానిక 'యూత్‌లీగ్' ప్రధాన కార్యదర్శిగా బ్రిటిష్ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిర్వహించిన అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు. మంచి వక్తగా ఖ్యాతిగాంచిన అబ్దుల్ రసూల్ మంచి కార్యదక్షుడు కూడా. స్వదేశీ వస్తువుల వాడకం అవసరాన్ని వివరిస్తూ పలు చర్యలు చేపట్టడమే కాకుండా స్వయంగా ఖాదీ వస్త్రధారణ పట్ల ఆయన అమితాసక్తి చూపారు. డాక్టర్ కె.బి అంత్రోలికార్ సహచర్యంలో బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ బ్రిటిష్ అధికారుల ఆగ్రహానికి గురయ్యారు. బ్రతుకుదెరువు కోసం స్థానికంగా కర్మాగారాలలో కార్మికునిగా పని చేస్తూ కార్మికులను ఏకం చేసి, కార్మిక సంఘాలను ఏర్పాటు చేయడంలో అగ్రగామిగా నిలిచారు. మాతృభూమి పట్ల, సమాజం పట్ల ఆయనకు గల అభిప్రాయాలను వెల్లడిస్తూ, ప్రజల స్వేచ్ఛా–స్వాతంత్ర్యాల కోసం ప్రతి ఒక్కరిని జాతీయోద్యమంలో భాగస్వాములను చేయడం ప్రధాన లక్ష్యంగా ప్రచారం కోసం 'గజన్‌ఫర్' అను ఉర్దూ పత్రికను 1927లో ఆయన ఆరంభించారు. ఈ పత్రికలో తన పంచశీల సూత్రాలకు అనుగుణంగా ప్రజలను చైతన్యపర్చుతూ, బ్రిటిష్ అధికారుల ఆగడాలను తూర్పార పడుతూ, ప్రధానంగా హిందూ–ముస్లింల మధ్య ఐక్యతను మరింత పటిష్ట పర్చేందుకు సంపాద కీయాలు, వార్తలు ప్రచురించారు. రంజాన్, బక్రీద్ పర్వ దినాలకు ప్రత్యేకంగా ఖాది వస్త్రాలను కొని, ధరించి ప్రాంతీయ వృత్తిదారులను ప్రోత్సహించాలని పిలుపు నిచ్చారు. ఈ చర్యలను ఏమాత్రం సహించని బ్రిటిష్ అధికారులు ఆయన మీద కత్తిగట్టారు. ప్రజాభిమానం గల అబ్దుల్ రసూల్‌ను పూర్తిగా అచేతనుడ్ని చేయడానికి తగిన అవకాశం కోసం ఎదురు చూడసాగారు. మహాత్ముడి అరెస్టుకు వ్యతిరేకంగా 1930 మే మాసంలో షోలాపూర్‌లో ప్రజాగ్రహ జ్వాల ఎగిసిపడింది. ఈ పరిస్థితిని నిలవరించలేకపోయిన ఆంగ్ల అధికారులు బ్రతుకుజీవుడా అంటూ షోలాపూర్ వదలి పారిపోయారు. ఆ సమయంలో మువ్వన్నెల జెండా షోలాపూర్‌లో రెపరెపలాడింది. ఈ అనూహ్య పరిణామాలతో మండిపడిన ఆంగ్లేయాధికారులు భారీ బలగాలతో షోలాపూర్ ప్రజల మీద విరుచుకుపడి సాగించిన కాల్పులలో పలువురు బలయ్యారు. ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని అబ్దుల్ రసూల్‌ను అరెస్టుచేసిన ఆంగ్ల అధికారులు అబ్దుల్ రసూల్, ఆయన సహచరుల మీద హత్యా నేరం మోపారు. బ్రిటిష్ న్యాయస్థానం విచారణ జరిపి ఆయనకు ఉరిశిక్ష ప్రకటించింది. ఆయన 20 ఏండ్ల యువకుడు కనుక క్షమాబిక్ష కోరినట్టయితే ఉరిశిక్ష నుండి తప్పించుకోవచ్చని వచ్చిన సలహాలను త్రోసిపుచ్చిన అబ్దుల్ రసూల్ ఖుర్బాన్ హుస్సేన్ 1931 జనవరి 17న నిర్భయంగా ఉరిని స్వీకరించి అమరులయ్యారు. ■



**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త సయ్యిద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

# కాజీ నజ్రుల్‌ను మరిచిపోయామా?

**మే 25వ తేదీ ప్రఖ్యాత విప్లవకవి కాజీ నజ్రుల్ ఇస్లాం జయంతి. ఆయన పుట్టి పెరిగిన పశ్చిమబెంగాల్ ప్రజలు ఆయన్ను మరిచిపోలేరు.**



**కాజీ నజ్రుల్ ఇస్లాం** బంగ్లాదేశ్ జాతీయ కవి. బెంగాలీ కవుల్లో రవీంద్రనాథ్ ఠాగూర్ సమకాలీకుడు. రవీంద్రనాథ్ ఠాగూర్‌కు లభించిన ప్రజాదరణ కాజీకి లభించలేదు. కాని కాజీ కవితలు, గేయాలు చాలా బలమైనవని విశ్లేషకులు, విమర్శకులు ముక్తకంఠంతో చెబుతారు. అయినా కాజీ విషయంలో ఉదాసీనత ఎందుకుంది? సమాజాన్ని ఉర్రూతలూపి కొత్త మార్పులు సాధించిన కవిత్వం గురించి మాట్లాడుతున్నప్పుడు కాజీ పేరును అన్యమనస్కంగా తప్ప ప్రస్తావించలేని పరిస్థితి ఎందుకుంది? బెంగాల్ కవిత్వంలో గొప్ప గొప్పవారి పేర్ల ప్రస్తావన వచ్చినప్పుడు కాజీ పేరు ఎందుకు వెనక్కి పోతోంది?

ఈ ప్రశ్నలకు సమాధానం బహుశా కాజీ జీవితంలో ఉంది. ఆయన విప్లవాత్మక కవనశైలిలో కూడా బహుశా ఉంది.

చాలా చిన్న వయసు నుంచి కాజీ రాయడం ప్రారంభించాడు. గ్రామీణ బెంగాల్, ముఖ్యంగా తన ఊరు చురులియా, అంటే ప్రస్తుతం అసాన్ సోల్ పరిసర ప్రాంతాల జానపద, ప్రజాగేయాల బాణీలో రాసేవారు. టీనేజీ వయసులోనే తన ప్రాంతంలో లెతో గాయకుల కోసం పాటలు రాసేవాడు. ఆ కాలంలోనే హిందూ పురాణాలు, పౌరాణిక కథలను లోతుగా అధ్యయనం చేశాడు. మొదటి ప్రపంచయుద్ధ కాలంలో బ్రిటీషు సైన్యంలో చేరాడు. క్వార్టర్ మాస్టర్‌గా పనిచేస్తూ పర్షియన్ క్లాసికల్ కవులను చదువు కున్నాడు. హాఫిజ్, రూమీ వంటి కవులతో ప్రభావితమయ్యాడు. ఆ కాలంలోనే కరాచీలో విధి బాధ్యతలు నిర్వర్తించేవాడు, కరాచీలో ఉన్నప్పుడే బోల్షివిక్ విప్లవం గురించి తెలుసుకున్నాడు. ఆ తర్వాత బ్రిటీషు వలసవాద సైన్యంలో తన పాత్ర ఏమిటి? తానేం చేస్తున్నాడనేది తీవ్రంగా ఆలోచించాడు. ఈ ఆలోచనల్లోనే కాజీ నజ్రుల్ ఇస్లాం విప్లవకవిగా ఆవిర్భవించాడు.

కొన్ని సంవత్సరాల తర్వాత దేశంలో గాంధీజీ సహాయనిరాకరణ ఉద్యమం ప్రారంభించారు. ఈ ఉద్యమం ఆయన్ను తీవ్రంగా ప్రభావితం చేసింది. లక్షలాది భారతీయులు అనుభవిస్తున్న బానిస సంకెళ్ళ గురించి ఆలోచించాడు. పేదరికం, దారిద్ర్యాల గురించి ఆలోచించాడు. ఆయన కవిత్వమంతటా ఇది కనిపిస్తుంది. ఈ కాలంలో ఆయన రాసిన కవిత అగ్నిబీణలో ఈ భావాలు బలంగా కనిపిస్తాయి. ఇవన్నీ రాజకీయ కవితలే. ఆ తర్వాత దేశంలో ఖిలాఫత్ ఉద్యమం ప్రారంభమయ్యింది. దేశంలో హిందూ ముస్లిం సమైక్యత సాధించినప్పుడే బ్రిటీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బలంగా నిలబడగలమని నమ్మాడు.

1922లో ఆయన 'ధూమకేతు' అనే పత్రికకు సంపాదకత్వం

వహించేవాడు. ధూమకేతు అంటే తోకచుక్క అని అర్థం. ఆ పత్రికలో "ధూమకేతు కేవలం కమ్యునిజానికి అంకితమైన పత్రిక మాత్రమే కాదు, హిందూ ముస్లిం సమైక్యతకు అడ్డంకిగా మారిన అపార్థాలను తొలగించడం కూడా పత్రిక లక్ష్యం" అని ప్రకటించాడు. కాజీ కవిత్వాన్ని పరిశీలిస్తే లౌకిక విలువల పట్ల పూర్తి నిబద్ధత కనిపిస్తుంది. దాంతో పాటు సోషలిస్టు ఆదర్శాలు బలంగా కనిపిస్తాయి. ఈ రెండు లక్షణాల వల్లనే తన సమకాలీన సాహిత్యకారులతో ఆయనకు చాలా వివాదాలు కూడా ఉండేవి. ముఖ్యంగా షోని బరేర్ చీటీ అనే సాహిత్య మాసపత్రిక రచయితలతో ఆయనకు వివాదాలుండేవి. షోనీబరేర్ చీటీ పత్రిక 1922 నుంచి వస్తున్న పాత పత్రిక. అప్పట్లో కల్లోల్ పేరుతో ప్రగతిశీల కవిత్వం ప్రచురించే పత్రిక రచయితలు ఈ సాహిత్యపత్రికలోని రచయితలను వ్యతిరేకించేవారు.

ఈ రెండు గ్రూపుల రచయితల మధ్య వివాదాలు ఆనాటి బెంగాలీ మేధోవర్గంలోని విభేదాలను తెలియజేస్తున్నాయి. కల్లోల్ పత్రికలో రాసే రచయితలు మార్క్సిస్టు దృక్పథంతో ప్రభావితమైనవారు. ఈ రచయితలు ఠాగూర్ తదితరుల సాహిత్యాన్ని వ్యతిరేకించేవారు. బ్రిటీషు సామ్రాజ్యవాద పాలనలో సాధారణ ప్రజల దుర్భరస్థితిపై ఈ రచయితలు ఎక్కువగా రాసేవారు. అంతేకాదు, బెంగాల్ రాజకీయాల్లోనూ, సంస్కృతిలోను మతపరమైన విభేదాలను తీవ్రంగా వ్యతిరేకించేవారు. కల్లోల్ పత్రికకు కాజీ నజ్రుల్ చాలా రచనలు పంపారు. ప్రేమేంద్ర మిత్ర, బుద్ధదేవ్ బోస్ వంటి సాహిత్యకారులు ఈ పత్రికకు రాసేవారు.

కాజీ నజ్రుల్ వివాహమాడిన అమ్మాయి పేరు ప్రమీలా సేన్ గుప్త. ఈ వివాహం తర్వాత హిందూ ముస్లిం మతశక్తులన్నీ ఆయన్ను వ్యతిరే కించాయి. సామాజికంగా ఒక బహిష్కరణ వాతావరణాన్ని ఎదుర్కొ న్నారు. చివరకు బ్రహ్మసమాజ్ వంటి సంస్కరణాత్మక ఉద్యమంలో కూడా కొందరు ఆయన్ను వ్యతిరేకించారు. ఖిలాఫత్ ఉద్యమం విఫలమైన తర్వాత బెంగాల్‌లో హిందూ ముస్లిం విభేదాలు, వైమనస్యాలు, విద్వేషాలు చాలా ఎక్కువయ్యాయి. మతకలహాలు జరిగాయి. అవిభక్త బెంగాల్ మతపరమైన అల్లర్లతో అట్టుడికింది. చిత్తరంజన్ దాస్ వంటి నాయకుల సమన్వయం వల్ల ఈ అల్లర్లను అదుపు చేయగలిగారు. డిసెంబర్ 1923లో హిందూ ముస్లిం ఒప్పందం కుదిరింది.

కాని 1925లో చిత్తరంజన్ దాస్ మరణించారు. ఆ తర్వాత ఈ ఒప్పందం కూడా కుప్పకూలింది. చిత్తరంజన్ దాస్ ఆదర్శాలను కాజీ నజ్రుల్ చాలా బలంగా సమర్థించేవారు. ఏప్రిల్ 1926లో కలకత్తా మరోసారి మతం మంటలకు ఆహుతయ్యింది. ఈ హింసా కాండకు చలించిపోయిన కాజీ నజ్రుల్ రాసిన కవిత 'కందారీ హొషియార్' ప్రసిద్ధ గేయం. కిషన్ నగర్‌లో జరిగిన ప్రొవిన్షియల్ కాంగ్రెస్ కాన్ఫరెన్సులో ఈ కవితను ఆయన స్వయంగా చదివారు. ఆ తర్వాత ఆయన రెండు ముఖ్యమైన వ్యాసాలు రాశారు. మందిర్ ఓ మస్జిద్ అంటే మందిరమా? మస్జిదా?? అన్న వ్యాసం ఆగష్టు 1926లో రాశారు. హిందూ ముసల్మాన్ అనే వ్యాసం సెప్టెంబరు 1926లో రాశారు. హిందూ ముస్లిమ్ సమైక్యతపై అనేక కవితలు రాశారు.

ఆ కాలంలోని రాజకీయాలకు మించి ఆయన ఆలోచించాడు. హిందూ ముస్లిం ఘర్షణల విషయంలో ఆయన ఆలోచనలు చాలా లోతైనవి. సాంస్కృతిక కోణంలో ఆయన ఈ సమస్యను చూశాడు. అలాగే సామాజిక, చారిత్రక కోణంలో కూడా సమస్యను పరిశీలించాడు. కాజీ నజ్రుల్ జీవిత చరిత్రను "ది డిసెంట్ ఆఫ్ నజ్రుల్ ఇస్లామ్: పోయట్రీ అండ్ హిస్టరీ" పేరుతో రాసిన ప్రీతి కుమార్ మిత్రా వెలిబుచ్చిన అభిప్రాయాలివి.

బెంగాలీ సాహిత్యానికి సంబంధించి కవితా సౌందర్య దర్శనంలో, అప్పటి ప్రజాజీవన రంగాలన్నింటిలోను ఆయన లౌకికవిలువలను అభిలషించాడు. సాహిత్యం, సాహిత్యభాష అన్నింటిలోను లౌకికవాదాన్ని ముఖ్యమైన పరికరంగా ఆయన భావించాడు. సెక్యులరిజం అనేది కేవలం రాజకీయ పరికరంగా పరిమిత పరిధికి ఆయన కుదించలేదు. ఆయన కవిత్వంలో ఈ అభివ్యక్తి అనేకవిధాలుగా మనకు కనిపిస్తుంది. హిందూ ముస్లిం ప్రతీకలను ఆయన కలగలిపి వాడేవారు. పదాల ఎంపికలోను ఈ వైఖరి కనిపిస్తుంది. అందువల్లనే ఆయన కవిత్వం సుసంపన్నంగా, విప్లవాత్మక మైనదిగా పేరుప్రఖ్యాతులు పొందింది. భారతీయ సాహిత్యంలో ఇది తనదైన ముద్ర వేసింది. పదసంపద విషయంలోనూ, కవిత్వ సౌందర్యదర్శన సంప్రదాయాల విషయంలోనూ ఆయన కవిత్వం బలమైన ముద్ర వేసింది. ఈ ప్రభావం 1947 వరకు మాత్రమే కాదు, ఆ తర్వాత కూడా కొనసాగింది. ఆయన రాసిన విశ్వవిఖ్యాత కవిత "బిద్రోహి" లో కొన్ని పంక్తులను పరిశీలిస్తే మనకు ఈ కవిత్వ సౌందర్యం అర్థమవుతుంది. బిద్రోహి అంటే తిరుగుబాటు దారుడు. 1921లో ఈ కవిత రాశారు. ఈ కవిత చదివితే ఆయన ఎంత సునాయాసంగా సంక్లిష్టమైన అంశాలను తనదైన కవనశైలిలో విప్లవాత్మకంగానే కాదు, తన కాలానికి

ఎంతో ముందు భవిష్యత్తును కూడా అంచనా వేశారని అర్థమవుతుంది.

**అమి ఇస్రాఫీలేర్ షింగార్ మహా హుంకార్**
**అమి పినాక్ పానీర్ డొమరు, త్రిశూల్, ధర్మరాజేర్ ధోండో**

ఇస్రఫీలు పూరించిన మహాకాహళ ఉగ్రభీకర హూంకారం నేనే పినాకపాణి ఢమరుకాన్ని, త్రిశూలాన్ని, ధర్మరాజ దండాన్ని నేనే (ఇస్రాఫీలు : ఇస్లాంలో ఒక దైవదూత పేరు, ప్రళయదినానికి ముందు ఆయన బూర ఊదుతాడు, ఆ తర్వాత ప్రళయం వస్తుంది).

ఈ పంక్తుల్లో చాలా సునాయాసంగా హిందూ, ముస్లిం ధార్మిక ప్రతీకలను ఒకే వరుసలో ఉపయోగించిన తీరు గమనించ దగింది. ఈ కవనశైలి అంతకు ముందు లేదు. మతతత్వంపై, మతపరమైన విభేదాలపై ఆయన వరుసగా తన కవితలతో దాడి చేశారు. ఫలితంగా హిందూ, ముస్లిం మతవర్గాల నుంచి వ్యతిరేకత ఎదుర్కున్నాడు. అప్పటి కవి సజనికాంత దాస్ దీనిపై తీవ్రమైన దాడి చేశాడు. కాజీ నజ్రుల్ పై దాడి చేయడం ద్వారా చిత్తరంజన్ దాస్ పై కూడా దాడి చేసేవాడు. చిత్తరంజన్ దాస్ హిందూ ముస్లిం సమైక్యత కోసం చేసిన ప్రయత్నాలపై దాడి చేసేవాడు. 'బిద్రోహి' కవితకు సజనికాంత్ దాస్ పేరడీ రాశాడు.

నజ్రుల్ తన కవిత్వంలో పర్షియన్, అరబిక్ పదాలు ఉపయో గించడాన్ని సజనీకాంత దాస్ తీవ్రంగా నిరసించాడు. ఈ వివాదంలోకి రవీంద్రనాథ్ ఠాగూర్ పేరు కూడా రావడంతో ఈ వ్యతిరేకత మరింత పెరిగింది. నజ్రుల్ తన కవిత్వంలో ఇస్లామిక్ పదాలను ఉపయోగించి, తీవ్రమైన వేగంతో రాసే కవిత అత్యంత తీక్షణంగా ఉండేది. కాని ఈ కవనశైలిని అప్పటి కొందరు మేధావులు వ్యతిరేకించడంతో ఒక విధమైన మతపరమైన విభజన కూడా చోటు చేసుకుంది. సాహిత్యంలో, సాహిత్య సౌందర్యదర్శనంలోను ఈ విభజన వచ్చేసింది.

డిసెంబర్ 1927లో రవీంద్ర పరిషద్‌లో రవీంద్ర నాథ్ ఠాగూర్ చేసిన ప్రసంగంలో ఈ కవిత్వాన్ని, కవిత్వంలో వాడే పదాలను విమర్శించారు. కొత్త తరం కవులు సంస్కృతపదం 'రక్త్' బదులు పర్షియన్ పదం 'ఖూన్' వాడడాన్ని నిరసించారు. కాజీ నజ్రుల్ అప్పట్లో రాసిన 'కందారి హొషియార్' కవితలో ఈ పదాన్నే ఉపయోగించాడు. ఈ కవిత 1926లో రాశాడు. ఆ కవిత అసాధారణ ప్రజాదరణ పొందింది. ఠాగూర్ తన ప్రసంగంలో కాజీ పేరు ప్రస్తావించలేదు. కానీ ఆయన నజ్రుల్ పైనే తన విమర్శ ఎక్కుపెట్టాడని చాలా మందికి స్పష్టంగా అర్థమైంది. నిజానికి కాజీని ఠాగూర్ చాలా ఇష్టపడేవారు.

'ఖూన్' పదం పర్షియన్ పదం. బెంగాలీలోను, హిందీలోను ఈ పదం హత్య అనే భావాన్ని కూడా సూచిస్తుంది. పర్షియన్‌లో ఖూన్ అంటే రక్తమని అర్థం. నజ్రుల్ రక్తమనే అసలు అర్థంతో ఈ పదాన్ని ఉపయోగించారు. ఠాగూర్ ప్రసంగం బంగ్లార్ కథ పత్రికలో అచ్చయ్యింది. షొనిబరేర్ చిట్టి పత్రిక ప్రారంభించిన దాడుల్లో ఇది కూడా భాగంగా కాజీ భావించాడు. ఆ తర్వాత కాజీ 1927 డిసెంబరులో ఆత్మశక్తి పత్రికలో 'బాదోర్ ప్రీతీ బాలీర్ బంద్' పేరుతో ఒక వ్యాసం రాశాడు. ఆ వ్యాసంలో సాహిత్యభాషపై చర్చించాడు. ఖూన్ అనే పదం వాడితే ఈ వ్యతిరేకత ఎందుకు వచ్చిందో చెప్పాడు. ఇదంతా ఇస్లామీయ భాష పై హిందూ అగ్రవర్ణ ఆధిపత్య ధోరణి చేస్తున్న దాడికి నిదర్శనంగా పేర్కొన్నాడు. అంతటితో ఆగలేదు, షొనిబరేర్ చిట్టి పత్రికలో రాసే రచయితలు సాహిత్య సౌందర్యదర్శనం విషయంలో సంకుచిత దృష్టితో వ్యవహరిస్తున్నారని, స్వయంగా రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల్లోను పర్షియన్ అరబీ పదాలున్నా యని విమర్శించాడు. ఈ పదాలు ఆధునిక బెంగాలీ వికాసానికి తోడ్పడ్డాయని చెప్పాడు. ఇది సాహిత్య సంప్రదాయమని, ఠాగూర్ కూడా దీన్ని పాటించారని, అనేకమంది రచయితలు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారని, బెంగాలీ భాషా వికాసానికి ఇది తోడ్పడిందని అన్నాడు. ఫిబ్రవరి 1928లో ఆత్మకథ పత్రికలో ప్రమద చతుర్థి రాసిన వ్యాసంతో ఈ వివాదం ముగి సింది. 'బాంగో సాహిత్యే ఖునేర్ మామ్లా' (బెంగాలీ సాహిత్యంలో 'రక్తం' వ్యవహారం) అని ఆయన రాశారు. తర్వాత కొంత కాలానికి చతుర్ది స్వయంగా కాజీ, ఠాగూర్ మధ్య ముఖాముఖి ఏర్పాటు చేశారు.

ఈ మొత్తం వివాదంలో గమనించవలసింది ఏమిటంటే, సంప్ర దాయవాదులు, మతతత్వవాదులకు వ్యతిరేకంగా పోరాటం. షొనిబరేర్ చిట్టి రచయితలు, కవులను కాజీ తీవ్రంగా వ్యతిరేకిం చాడు. ఎందుకంటే, వారంతా అగ్రకుల ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తున్నారని భావించాడు. ఆధునిక యూరోపియన్ కవిత్వ సౌందర్యతత్వ దర్శనాన్ని స్వాగతించలేని ధోరణిగా భావించాడు. కాజీ నజ్రుల్‌తో పాటు అప్పట్లో కల్లోల్ పత్రికలో రాసిన రచయితలు, కవులు బెంగాలీ సాహిత్యంలో ఇతర భాషా ప్రభావా లను స్వీకరించే ధోరణిని, రాజకీయ కవిత్వాన్ని, లౌకిక స్ఫూర్తిని బలపరుస్తూ రాశారు.

✤

# జాత్యాహంకారం

**అమ్రా**

**అమెరికాలోని** ప్రతి పదిమంది నల్లవాళ్ళలో ఎనిమిది మంది జాతివివక్షకు గురవుతున్నారు. జర్మనీలో 77 శాతం నల్ల వాళ్ళు జాతివివక్ష ఎదుర్కొంటున్నారని ఇటీవల కొన్ని అధ్యయనాలు తెలియజేశాయి. అమెరికాలో జాత్యాహంకార ధోరణులు పెరుగుతున్నాయని రాయిటర్స్ వార్తా సంస్థ కూడా గతంలో తెలియజేసింది. అసహనం, అతివాదం, వివక్ష, సంకుచిత భావాలు అమెరికాలో పెరుగుతున్నాయి. ముఖ్యంగా ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాతి నుంచి ఈ సమస్య మరింత పెరిగింది. నల్లవారి పట్ల శ్వేతజాత్యాహం కారం ఈ రోజు కొత్త కాదు. చాలా కాలం నుంచి ఉన్నదే. అమెరికాలో బానిసత్వం అంతరించినప్పటికీ, నల్లవారి పట్ల వివక్ష కొనసాగుతూనే ఉందని చెప్పే అనేక సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. సదుపాయాలు, సౌకర్యాలన్నీ తమకే చెందాలన్న భావం తెల్లవారిలో అధికంగా కనబడుతుంది. నల్ల వారిని తక్కువగా చూడడం కొనసాగుతూనే ఉంది.

రాయిటర్ వార్తాసంస్థ గతంలో చేసిన ఒక అధ్యయనం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. యావత్తు అమెరికాలో ఈ అధ్యయనం నిర్వహించారు. దేశానికి అతిపెద్ద ప్రమాదం ఏమిటని అడిగిన ప్రశ్నకు వివిధ సముదాయాలు, వివిధ హోదాల్లో వ్యక్తులు ఇచ్చిన జవాబుల ఆధారంగా అమెరికా సమాజంలోని ఆలోచనాధోరణిని అర్థం చేసుకునే ప్రయత్నం జరిగింది. ఈ అధ్యయనం తర్వాత రూపొందించిన నివేదికను ప్రచురించడం జరిగింది. గమనించదగిన విషయమేమంటే, తెల్లవాళ్ళు, నల్లవాళ్ళు అన్న తేడా లేకుండా అందరిలోను వివక్ష, సంకుచితభావాలు కనిపిస్తున్నాయి. తెల్లవాళ్ళు అధికులమని భావిస్తున్నట్లే, నల్లవాళ్ళలోను వారి పట్ల విద్వేషం ఎక్కువవు తోంది. ఈ విద్వేషాగ్ని ఒక్కోసారి భగ్గుమని ప్రతీకార చర్యలకు పాల్పడేలా, దాడులు చేసేలా మారుతోంది. అంటే తెల్లవాళ్ళు, నల్లవాళ్ళ మధ్య దూరం ఎంతగా పెరిగిపోయిం దంటే పచ్చగడ్డి భగ్గుమనే పరిస్థితి లోలోన రాజుకుంటోంది.

నల్లవాళ్ళే దేశానికి, సమాజానికి ప్రమాదమని తెల్లవాళ్ళు భావి స్తుంటే, తెల్లవాళ్ళే దేశానికి సమాజానికి ప్రమాదమని నల్ల వాళ్ళు భావిస్తున్నారు. తెల్లవాళ్ళు తాము గొప్పవాళ్ళమని జాతి పరంగా భావిస్తుంటే, తెల్లవాళ్ళయినందువల్లనే వాళ్ళు హీనులని నల్లవాళ్ళు భావిస్తున్నారు. ఈ విద్వేషం, వివక్షలు ఈ నాటివి కావు, శతాబ్దాల చరిత్ర ఉంది. బానిసత్వ అణిచివేతల దుర్మార్గాలున్నాయి. నేడు ఈ ద్వేషభావం తారా స్థాయికి చేరుకుంది. నల్లవాళ్ళు తెల్లవాళ్ళను భరించడానికి సిద్ధంగా లేరు. తెల్లవాళ్ళు నల్లవాళ్ళను సమానంగా చూడ్డానికి సిద్ధంగా లేరు.

శ్వేతజాత్యాహంకారం, అణిచివేతలు, దౌర్జన్యాల వల్ల నల్ల వారిలో ఈ విద్వేషం చోటుచేసుకుంటే, ప్రతీకార చర్యల వల్ల తెల్లవారిలో శ్వేతజాత్యాహంకారం మరింత బుసలు కొడు తోంది. ఒకరిని ఒకరు దెబ్బతీయడానికి కాచుక్కూర్చున్న ట్లుంది పరిస్థితి. అందువల్లనే దాడుల సంఘటనలు పెరుగు తున్నాయి. ఆరాధనాలయాలు, విద్యా సంస్థలు, జన సమ్మర్థం ఉన్న బజారుల్లో కాల్పుల సంఘటనలు చోటు చేసుకుంటు న్నాయి. విచిత్రమేమంటే చాలా మంది తెల్లవారు, నల్లవారు ఒకే మతానికి చెందిన వారు.

సమానత్వానికి ప్రజాస్వామ్యానికి పెద్ద పీట వేస్తామని చెప్పుకునే అమెరికా పరిస్థితి ఇది. వివక్షను ఎంత మాత్రం సహించమని చెప్పుకునే దేశంలో పరిస్థితి ఇది. నాగరికతకు ధ్వజవాహకుల మని చెప్పుకునే వారి పరిస్థితి ఇది. నిజానికి అమెరికా అనే కాదు, పాశ్చాత్య దేశాలన్నీ ఇలాంటి సమానత్వ, ప్రజాస్వామిక సూత్రాలనే స్వీకరించాయి. కాని ఆచరణలో అక్కడ సమానత్వం కాని, మానవవిలువలు కాని, సహనశీలం కాని కనిపించవు.

ఆచరణలో అలాంటి సమానత్వం ఒక్క ఇస్లామీయ వ్యవస్థ మాత్రమే అమలు చేసి చూపించింది. రాజయినా, పేదయినా ఒకే వరుసలో నిలబడేలా చేసింది. ప్రతి మస్జిదులో ప్రతి రోజు ఐదుపూటల ఈ సమానత్వం అందరికీ కనిపిస్తూనే ఉంది. ఇస్లాంను నిష్పక్షపాతంగా అధ్యయనం చేసిన వారికి ఇది అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. ☐

- అమ్రా

# అవినీతి అంతమయ్యిందా?



**అవినీతి**ని అంతం చేస్తానని చెప్పి మోడీ వాగ్దానం చేసి అధికారం లోకి వచ్చారు. "న ఖాఊంగా న ఖానే దూంగా" అంటే 'నేను తినను, ఎవరినీ తిననివ్వను' అంటూ ప్రజలను నమ్మించారు. ప్రతిపక్ష నేతలు ఏ మాత్రం అవినీతి చేసినా ఈడీ, సిబిఐ, ఇన్‌కంటాక్సు డిపార్టుమెంట్ల దాడులు పెరిగాయి. అనేకమంది ప్రతిపక్ష నేతలు జైళ్ళలో ఉన్నారు. అసలు ప్రశ్న ఏమిటంటే, కేవలం ప్రతిపక్ష నేతలు మాత్రమే అవినీతిపరులా? నిలువునా కుంభకోణాల్లో మునిగివున్న ప్రతిపక్ష నేతలు బిజెపిలో చేరగానే వారిపై ఉన్న అవినీతి ఆరోపణలు వాషింగ్ మెషిన్లో శుభ్రమైనట్లు మాయమైపోతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ నేతలపై వచ్చిన అవినీతి ఆరోపణల జాబితా కూడా చిన్నదేమీ కాదు.

ఆదానీ ఎయిర్‌పోర్ట్ స్కాము విషయంలో కేరళ ముఖ్యమంత్రి పిన్నరాయి విజయన్ మోడీ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. విమానాశ్రయాల నిర్వహణలో ఆదానీ కంపెనీకి ఎలాంటి అనుభవమూ లేదని, అలాంటి వ్యాపార సంస్థ ఆరు విమానాశ్రయాల్లో ఐదు విమానాశ్రయాలను చేజిక్కించుకోవడం అనుమానాస్పదంగా ఉందని అన్నారు. మధ్యప్రదేశ్ వ్యాపార ప్రకటనల కుంభకోణంలో కోట్లాది రూపాయల అవకతవకలు జరిగాయి. అస్సాం సివిల్ సర్వీసెస్ పరీక్షల స్కాము బీజేపీ ఎం.పీ.ఆర్.పిశర్మ కూతురు పల్లవి శర్మతో సహా 19 మంది ప్రభుత్వ అధికారులను అరెస్టు చేయడం జరిగింది. ఆదానీ భూ కుంభకోణం కూడా బయటకు వచ్చింది. గుజరాత్ ప్రభుత్వం ఆదానీ గ్రూపు కోసం 14,305 ఎకరాల భూమి కారుచౌక ధరకు కేటాయించిందని ఆరోపణ. ఏడిసిబి స్కాము నోట్ల రద్దు కాలంలో జరిగింది. అహ్మదాబాద్ డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ బ్యాంకు కేవలం 5 రోజుల్లో 745.58 కోట్ల రూపాయల పాత నోట్లను స్వీకరించింది. ఇంత పెద్ద మొత్తాన్ని అందుకున్న ఏకైక జిల్లా సహకార బ్యాంకు ఎడిసిబి. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఈ బ్యాంకు డైరెక్టర్లలో ఒకరు. బుందేల్ ఖండ్ ప్యాకేజీ కుంభకోణంలో శివరాజ్ సింగ్ ప్రభుత్వం 2100 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఇందులో అవినీతి గురించి ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపించాయి. బడ్జెట్ కుంభకోణం. బజ్రీ ఇసుక తవ్వకాల కుంభకోణం. భామాషా ఆరోగ్య బీమా కుంభకోణం, బిట్కాయిన్ కుంభకోణం వంటి అనేక స్కాములు ఇప్పుడు ఎవరికి గుర్తు కూడా లేవు. గుజరాత్లోని బిజెపి నేతలు హవాలా లావాదేవీల ద్వారా అక్రమ డబ్బును క్రిప్టో కరెన్సీగా మార్చిన ఆరోపణలు వచ్చాయి. గుజరాత్ సిఐడి ప్రకారం ఈ కుంభకోణం విలువ రూ. 5000 కోట్లు. స్థానిక వార్తాపత్రికల ప్రకారం ఈ కుంభకోణం 88,000 కోట్ల రూపాయల కంటే చాలా ఎక్కువ. బీజేపీ నేత నళిన్ కొట్టాడియా పరారీ అయిపోయాడు. బిల్డింగ్ కుంభకోణం మరో స్కాము. గోవాలో పట్టో ప్లాజాలోని కార్యాలయ ప్రాంగణానికి ఏడాది అద్దె 5,50,10,538 రూపాయలను గోవా ప్రభుత్వం చెల్లించింది. కేమన్ ఐలాండ్స్ ఎఫ్డీఐ కుంభకోణంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కుమారుడు వివేక్ దోవల్ నోట్ల రద్దు జరిగిన 13 రోజుల తర్వాత 2016 నవంబర్ 21న కేమన్ దీవులలో GNY ఆసియాను ప్రారంభించాడు. ఇందులో అవినీతికి సంబంధించి ఆరోపణలు వచ్చాయి. చిట్‌ఫండ్ కుంభకోణం చత్తీస్‌గఢ్‌లో జరిగింది. 2015-2017 మధ్య కాలంలో 111 కంపెనీలు 1,33,697 మంది పెట్టుబడిదారులను 484,39,18,122 రూపాయల మేర మోసం చేశాయని వార్త. క్లోజర్ ఆఫ్ గవర్నమెంట్

స్కూల్స్ కుంభకోణం గురించి కూడా చెప్పుకోవాలి. రాజస్థాన్ ప్రభుత్వం 17,000 ప్రభుత్వ పాఠశాలలను మూసివేసింది. దానివల్ల ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకోవడం తప్ప గత్యంతరం లేకుండా పోయింది. చాపర్ స్కాము లేదా హెలీకాప్టర్ కుంభకోణం ఛత్తీస్గఢ్‌లో జరిగింది. కోల్ కుంభకోణం లేదా బొగ్గు తవ్వకాల కుంభకోణం కూడా ఉంది. సిటుర్జియా కుంభకోణం రిషికేష్‌లో జరిగింది. దీని విలువ రూ.400 కోట్లు. మహారాష్ట్రలో చిక్కీ కుంభకోణం విలువ 206 కోట్ల రూపాయలు. ఢిల్లీలో జరిగిన డిడిసిఏ కుంభకోణం గురించి బీజేపీ ఎం.పీ. కీర్తి ఆజాద్ ఈ ఆరోపణలు చేశారు. డాల్ లేదా పప్పుల కుంభకోణం గుజరాత్ మహారాష్ట్రల్లో జరిగింది. గోవాలో జరిగిన డిఫెన్స్ ఎక్స్ పో స్కాము, డి మ్యాట్ స్కాములు కూడా ఉన్నాయి. బీజేపీ నేత రాజేంద్రసింగ్ పేరు డిమ్యాట్ స్కాములో ప్రముఖంగా వినిపించింది. ఈ స్కాము విలువ పదివేల కోట్లరూపాయలు. వీటన్నింటికి మించి డిమానిటైజేషన్ లేదా నోట్లరద్దు పెద్ద స్కాముగా ఆరోపణలు వచ్చాయి. నోట్లరద్దుకు ముందు బీజేపీ నేతలు కోట్లాది రూపాయల భూములు కొన్నారని ఆరోపణలు వచ్చాయి. ఇంకా ఎన్నో స్కాములున్నాయి. ఈ టెండర్ స్కాము చత్తీస్‌గఢ్‌లో జరిగింది. మొత్తం 4,601 కోట్ల రూపాయల స్కాము ఇది. మధ్యప్రదేశ్‌లోని ఎలక్ట్రిసిటీ స్కాము కూడా ఈ జాబితాలో ఉంది. మధ్యప్రదేశ్‌లో కూడా ఈ టెండర్ స్కాము జరిగింది. ఈస్కాము విలువ 3000 కోట్ల రూపాయలు. ఎర్తక్వేక్ లేదా భూకంపం బాధితులకు సహాయంలోను స్కాము జరిగింది. గుజరాత్‌లోని రాధన్ పూర్ బీజేపీ నాయకుడిపై కేసు దాఖలయ్యింది. రాజస్థాన్‌లో ఫేక్ పైలట్ స్కాము జరిగింది. బీజేపీ మంత్రి కుమారుడు ఈ స్కాములో నిందితుడిగా ఉన్నాడు. మహారాష్ట్రలో ఫైర్ EXTINGUISHERS SCAM జరిగింది. గుజరాతులో ఫిషింగ్ కాంట్రాక్టుల స్కాము జరిగింది. కేరళలో బయటపడిన ఫేక్ కరెన్సీ అంటే దొంగనోట్ల స్కాములో బీజేపీ నాయకుడు అరెస్టయ్యాడు. గుజరాతులో గ్రౌండ్ నట్ లేదా వేరుశనగ స్కాము విలువ 4000 కోట్ల రూపాయలు. గుజరాతులోనే గిఫ్ట్ స్కాము విలువ 2700 కోట్ల రూపాయలు. 2013 కాగ్ నివేదిక దీన్ని వేలెత్తి చూపించింది. గోవాలో GSIDC Contractor Scam 2016 నాటిది. గోవాలోనే GSIDC Consultant Scam జరిగింది. హౌసింగ్ స్కాము ఉత్తరప్రదేశ్‌లో జరిగింది. హడ్కో స్కాము విలువ 14,500 కోట్ల రూపాయలు. గోవాలో హౌసింగ్ లోన్ స్కాము జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో ఇల్లీగల్ కాంట్రాక్టుల స్కాము, మధ్యప్రదేశ్‌లో ఇల్లీగల్ శాండ్ మైనింగ్ అంటే ఇసుక తవ్వకాల స్కాము, IL&FS SCAM, చత్తీస్‌గఢ్‌లో Indira Priyadarshini Mahila Sahakari Bank Scam గుజరాతులో Indigold Refinery scam, గోవాలో IFFI Mega Scam వగైరా చాలా ఉన్నాయి. బీజేపీ నేత అమిత్ షా కుమారుడు జై షా నడుపుతున్న కంపెనీ టర్నోవరు 16వేల రెట్లు పెరిగి పోయింది. అది కూడా కేవలం ఒక్క సంవత్సర కాలంలోనే. KAMENG HYDRO ELECTRIC PROJECT SCAM అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగింది. ఈ స్కాము విలువ 450 కోట్ల రూపాయలు. గుజరాత్ L&T LAND SCAM విలువ 129 కోట్ల రూపాయలు. గుజరాతులోనే ల్యాండ్ స్కాము, ఉత్తరాఖండ్‌లో ల్యాండ్ స్కాము, కర్నాటకలో ల్యాండ్ స్కాము, గోవాలో ల్యాండ్ స్కాము, రాజస్థానులో లెడ్ బల్బుల స్కాము, ఛత్తీస్‌గఢ్ ల్యాండ్ స్కాములు జరిగాయి. మహారాష్ట్రలో MIDC LAND SCAM, మధ్యప్రదేశ్‌లో MPPSC SCAM, హర్యానాలో మన్రేగా స్కాము, ఉత్తరా ఖండ్‌లో మహా కుంభమేళ స్కాములతోపాటు లలిత్ మోడీ స్కాము జరిగాయి. రాజస్థాన్‌లో మైనింగ్ స్కాము, 9000 కోట్ల రూపాయల మాల్యా కుంభకోణం అందరికీ తెలిసిందే. 297 కోట్ల రూపాయల మెడిసిన్ కుంభకోణం మహారాష్ట్రలో జరిగింది. ఢిల్లీలో MCD PENSION SCAM కేరళలో MCI SCAM, మధ్యప్రదేశ్‌లో NARMADA PLANTATION SCAM జరిగాయి. నీరవ్‌మోడీ స్కాము విలువ 22వేల కోట్ల రూపాయలు. అస్సాంలో NORTH CACHAR HILLS SCAM, గుజరాతులో నానో ప్లాంట్ ల్యాండ్ స్కాము, NULM scam, NEET SCAMలతో పాటు గుజరాతులో నాలియా స్కాము, ఓఎన్‌జీసీ స్కాముతో సహా అనేక స్కాములున్నాయి. పూనే ల్యాండ్ స్కాము, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన పెట్రోలు పంపుల స్కాము, ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన PDS SCAM విలువ 36వేల కోట్ల రూపాయలు. QUESTION PAPER LEAK SCAMలో విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడారు. రాజస్థాన్‌లో రాజే ఎయిడ్స్ కరప్షన్ స్కాముతో పాటు రఫాయల్ స్కాము, గుజరాతులో జరిగిన SMRITI IRANI MPLAD SCAM, SPECTRUM SCAM, SKILL INDIA SCAM, జార్ఖండ్‌లో జరిగిన సీడ్స్ స్కాము, గుజరాతులో జరిగిన SSY SCAM, SWAN ENERGY-GSPC SCAM, మహారాష్ట్రలో జరిగిన TUR SCAM, TAKE HOME RATION SCAM, మధ్యప్రదేశ్‌లో జరిగిన Ujjain Simhastha Kumbh Mela scam, గుజరాతులో జరిగిన UNIVERSITY LAND SCAM, మధ్యప్రదేశ్‌లో వ్యాపం స్కాము, గుజరాతులో జరిగిన వాటర్ బోర్డు స్కాము, మధ్యప్రదేశ్‌లో జరిగిన WATER RESOURCES DEPT స్కాము, WEIGHT MANIPULATION SCAM, X-RAY TECHNICIAN RECRUIT MENT SCAM, కర్నాటకలో YEDDY DIARIES స్కాము, YEDDYURAPPA LAND SCAM, మధ్యప్రదేశ్‌లో జరిగిన ZUBIN IRANI LAND SCAM ఇలా అనేక స్కాములున్నాయి.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

12-14 ఆయనే ఈ సమస్త జతలను సృజించాడు,[12] మీ కొరకు పడవలను, పశువులను వాహనాలుగా చేశాడు, మీరు వాటి వీపులపై నెక్కి వాటిపైన కూర్చున్నప్పుడు తమ ప్రభువు మహోపకారాన్ని గుర్తుచేసుకోవాలని, ఇంకా ఇలా అనాలనీను, "పరిశుద్ధుడాయన, మా కొరకు వీటిని స్వాధీనపరిచాడు లేకపోతే మేము వీటిని లోబరచుకోగల శక్తి గలవారము కాము.[13] మరి ఒకరోజునయితే మేము మా ప్రభువు వైపునకు మరలవలసి ఉంది."

12. జతలు అంటే, కేవలం మానవాళిలోని స్త్రీ పురుషులు, జంతురాశిలోనూ, వృక్షరాశిలోనూ గల ఆడ, మగలు మాత్రమే కాదు. ఇంకా ఇతర అసంఖ్యాకమయిన వస్తువులూ ఉన్నాయి. వాటిని సృష్టికర్త ఒక దానికొకటి జతగా చేశాడు. వాటి కలయిక వల్ల లేదా మిశ్రమం వల్ల ప్రపంచంలో సరికొత్త వస్తువులు ఉనికి లోకి వస్తాయి. ఉదాహరణకు పదార్థముల్లో కొన్నింటికి కొన్నింటితో జత కలుస్తుంది, కొన్నింటికి కొన్నింటితో కలువదు. వేటి జత కలుస్తుందో వాటి కలయిక ద్వారానే రకరకాల మిశ్రమాలు ఉనికిలోకి వస్తున్నాయి. లేదా ఉదాహరణకు విద్యుత్తులో రుణ, ధన, విద్యుచ్ఛక్తులు ఒకదానికొకటి జతలు. వాటి పరస్పర ఆకర్షణలే ప్రపంచంలో చిత్రవిచిత్రమయిన అద్భుతాలకు కారణ మవుతున్నాయి. ఇవీ ఇంకా ఇలాంటివే అగణ్యమయిన జతలు రకరకాల సృష్టితాల్లో అల్లాహ్ సృష్టించాడు. వాటి నిర్మాణం, వాటి పరస్పర అనుకూలత (Compatability), వాటి మధ్య సహకారానికి విభిన్న రూపాలు, వాటి కలయిక వల్ల కలిగే పరిణామాలు, మనిషి వీటిని గమనిస్తే, ఈ సమస్త విశ్వ కర్మాగారం ఒకే ఒక్క తిరుగులేని బలోపేతుడు విజ్ఞుడూ అయిన నిర్మాణ కర్త తయారుచేసిందే అనీ, ఆయన నిర్వహణ వల్లనే నడుస్తుందనీ అతని ఆంతర్యం సాక్ష్యం పలకకుండా ఉండజాలదు. కేవలం బౌద్ధిక కబోది మాత్రమే ఇదంతా ఏ విజ్ఞుడూ లేనిదే రూపొందిం దని, కొనసాగుతోందని లేదా ఇందులో ఒకరిని మించిన దేవుళ్ళ జోక్యం కలిగే అవకాశముందనీ ఊహించుకోగలడు.

13. అంటే, భువిలోని సమస్త సృష్టిరాశుల్లో ఒక్క మానవునికే ఓడలు, పడవలు నడిపే సామర్థ్యం అల్లాహ్ ఎందుకు ఇచ్చినట్లు? అనంత సముద్రపు భయంకర అలల మధ్యన వాటిని పరిగెత్తించే అవకాశాలను కల్పించినవాడు ఎవడో ఎన్నడూ ఆలోచించక పోవడానికా? అసంఖ్యాక పశుగణంలో కొన్నింటిని, అవి మన కన్నా ఎన్నోరెట్లు బలం గలవయినప్పటికీ వాటిని వాహనంగా వినియోగించుకునే, ధాన్యపు బస్తాల్లా వాటిపైకెక్కి మనకు ఆజ్ఞా బద్ధమైపోయేలా మన ఇష్టం వచ్చిన వైపునకు వాటిని తీసుకు వెళ్ళేందుకు వీలయినట్లుగా సృష్టించిన వాడెవడో యోచించక పోవడానికా? ఆయన ఈ యోగ్యతలు మనకు ఇందుకే ప్రసాదించలేదు కదా? ఈ వరప్రసాదాల ద్వారా ప్రయోజనం పొందడం, వరప్రసాదాల ప్రదాతను విస్మరించడం హృదయం మృతిచెందిందనడానికీ, బుద్ధీ అంతరాత్మలు అనుభూతిహీనమయి పోయాయనడానికి చిహ్నం. ఒక సజీవమయిన, సచేతనమయిన, స్పృహ, అనుభూతులుగల హృదయమూ అంతరాత్మ గల మానవుడయితే ఈ వాహనాలపై ఎక్కినప్పుడు అతని ఆంతర్యం, వరప్రసాదం స్పృహతో, వరప్రసాదానికి కృతజ్ఞతా భావంతో నిండి పొరలిపోతుంది. అతను అప్రయత్నంగా చాటుతాడు, నా కోసం ఈ వాహనాలను అధీనపరచినవాడు పరిశుద్ధుడు. పరిశుద్ధుడాయన, ఆయన ఉనికిలో, గుణగణాలు, అధికారాలలో మరెవరయినా ఆయనకు తోడయి ఉండటానికి అతీతుడు, పరిశుద్ధుడాయన. తన దైవత్వపు కార్యకలాపాలు తాను స్వయంగా నడపడానికి అశక్తుడయి ఇతర సహాయక దేవుళ్ళ అవసరం ఆయనకు ఏర్పడటం వంటి బలహీనతకూ ఆయన అతీతుడు, పరిశుద్ధుడు. ఈ వరప్రసాదాలకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి నేను అతనితోపాటు మరెవరినయినా భాగస్వామి చేయడానికీ పరిశుద్ధుడాయన.

ఈ ఆయత్ ఉద్దేశానికి ఉత్తమమయిన ఆచరణాత్మకమయిన వ్యాఖ్యానం, దైవసందేశహరులు (స) వాహనాలనెక్కి స్వారీ చేస్తున్నప్పుడు ఆయన నోట వెలువడే స్మరణలు. మహనీయ అబ్దుల్లా బిన్ ఉమర్ (ర) ప్రకారం, ప్రవక్త(స) ప్రయాణానికి సిద్ధమయి వాహనం ఎక్కి కూర్చున్నప్పుడు మూడు పర్యాయాలు అల్లాహు అక్బర్ పలికేవారు, తరువాత ఈ ఆయత్ పఠించేవారు, ఆ తరువాత ఈ దుఆ పఠించేవారు:

**(13వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

## 3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

**453)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: నేను హజ్రత్ ఖదీజా(ర.అ) విషయంలో చెందినంత ఈర్ష్య(రష్క్) మరే మహిళ వ్యవహారంలోనూ చెందలేదు. ఎందుకంటే ప్రవక్త మహనీయులు(స) తరచూ ఆమెను ప్రస్తుతిస్తూ ఉండేవారు. ఆమె ఇంకా ఇలా అన్నారు: ఆమె మరణించిన మూడు సంవత్సరాల తర్వాత నా వివాహం దైవ ప్రవక్త(స)తో జరిగింది. అల్లాహ్ ఆయన(స)కు ఆజ్ఞాపించాడు లేదా జిబ్రీల్ (అలైహిస్సలామ్) ద్వారా సందేశం పంపించాడు- స్వర్గంలో ఆమెకు ముత్యాల మేడ లభిస్తుందన్న శుభవార్తను వినిపించమని.


**454)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా (ర.అ) ఇలా వివరించారు: దైవ ప్రవక్త (సఅసమ్) సతీమణులలో నాకు హజ్రత్ ఖదీజా (ర.అ)పై కలిగినంత ఈర్ష్య మరెవరిపైనా కలిగేది కాదు. మరి వాస్తవానికి నేను ఆమెను చూడనయినా లేదు. కాని దైవప్రవక్త(స) తరచూ ఆమెను గురించి ప్రస్తావిస్తూ ఉండేవారు. ఎప్పుడయినా మేకను జిబహ్ చేస్తే, మాంసాన్ని ముక్కలుగా చేసి ఖదీజా(ర.అ) స్నేహితురాళ్ళకు పంపించేవారు. 'ఈ లోకంలో ఖదీజా(ర.అ) తప్ప మరే మహిళా లేనట్లే మాట్లాడతా రేమిటి?' అని నేను దైవప్రవక్త(స)తో అంటే, "ఆమె మాటే వేరు. ఆమె ద్వారా నాకు సంతాన భాగ్యం ప్రాప్తమయింది" అని ఆయన(స) బదులిచ్చేవారు.[1]

**456)** హజ్రత్ అబూ హురైరా(రజి) వివరించారు : దైవదూత జిబ్రీల్(అ) దైవప్రవక్త(సఅసమ్) దగ్గరకు వచ్చి, "దైవప్రవక్తా! ఖదీజా(ర.అ) ఒక పాత్రను తీసుకుని మీ దగ్గరకు రాబోతున్నారు. అందులో కూర ఉంది లేదా (ఇలా అన్నారు) తినే త్రాగే పదార్థం ఉంది. ఆమె మీ దగ్గరకు వచ్చినప్పుడు, ఆమె ప్రభువు తరఫున ఆమెకు సలామ్ చెప్పండి, నా తరఫున కూడా. ఆమె కోసం స్వర్గంలో ఒక ముత్యాల మేడ ఉందన్న శుభవార్త కూడా వినిపించండి. అందులో ఎలాంటి గలాటా గానీ, బాధ గానీ, అలసట గానీ ఉండదు" అని తెలియజేశారు.

హజ్రత్ ఆయిషా(ర.అ) కథనం: హజ్రత్ ఖదీజా(ర.అ) సోదరి హాలా బిన్తె ఖువైలిద్ ఒకసారి వచ్చి, లోనికి వచ్చేందుకు దైవప్రవక్త(స)ను అనుమతి కోరారు. అప్పుడు ఆయన(స)కు ఖదీజా అనుమతి కోరే విధానం జ్ఞాపకం వచ్చి, ఉలిక్కిపడ్డారు. "అల్లాహ్! ఈమె హాలా కదూ!" అని పలికారు. ఆ మాటపై నాకు ఈర్ష్య కలిగింది. 'ఏమిటి, మీరు ఇప్పటికీ పళ్ళూడిపోయి, కేవలం పెదవులపై ఎరుపుదనం మాత్రమే మిగిలిన ఆ వృద్ధురాలిని తలచుకుంటున్నారా? ఆమె చనిపోయి చాలా కాలం అయింది కదా! అల్లాహ్ ఆమెకన్నా మంచి భార్యను ఇచ్చి ఉండగా (ఆమెనే ఎందుకింతగా తలచుకుంటున్నారు?)' అని అన్నాను.[1]

454-1. దీనినిబట్టి దైవప్రవక్త(స) దృష్టిలో ఖదీజా(ర.అ) స్థానం ఎటువంటిదో ఊహించవచ్చు. యథార్థానికి ఆమె ఇస్లామ్‌ను స్వీకరించిన తొలి మహిళ. ఇస్లామ్ ప్రవక్త(స)కు తోడుగా నిలిచి, ఆమె చేసిన ఉపకారాలకు ప్రతిఫలం అల్లాహ్ మాత్రమే వొసగగలడు - రజిఅల్లాహ్ అన్హా వ రజూ అన్హా.

456-1. ముస్నద్ అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం హజ్రత్ ఆయిషా(ర.అ) చెప్పిన ఈ మాట విని దైవప్రవక్త(స) ఆగ్రహం చెందారు. కోపంతో ఆయన(స) ముఖార విందం కందిపోయింది. అప్పుడు హజ్రత్ ఆయిషా(ర.అ) నిలబడి దైవసన్నిధిలో క్షమాపణ కోరుకున్నారు. ఆనాటి నుంచీ ఎన్నడూ దైవప్రవక్త(స) ముందు ఆ విధంగా మాట్లాడలేదు.




**ఇప్పుడు మళ్ళీ రిజర్వేషన్ల చర్చ మొదలయ్యింది.** బీజేపీ నాయకులు కొంతమంది ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు కారణం. ఆ వ్యాఖ్యలేమిటంటే, రాజ్యాంగాన్ని మార్చడానికి ఈ సారి 400కు పైగా సీట్లు అవసరమని అన్నారు. కర్నాటక బీజేపీ నాయకుడు అనంత్ హెగ్డే ఈ మాటలు చాలా రోజుల క్రితమే చెప్పారు. రాజస్థాన్ నాగపూర్‌లో మాట్లాడుతూ జ్యోతిమిర్ధా అనే మరో బీజేపీ నాయకుడు కూడా ఇవే మాటలు చెప్పారు. అయోధ్య నుంచి పోటీ చేస్తున్న బీజేపీ నాయకుడు లల్లూ సింగ్ వ్యాఖ్య కూడా వచ్చింది. మీరట్ నుంచి పోటీ చేస్తున్న అరుణ్ గోవిల్ కూడా ఇవే మాటలు చెప్పాడు. వీళ్ళందరు చెప్పింది ఒక్కటే రాజ్యాంగాన్ని మార్చడానికి 400 కన్నా ఎక్కువ సీట్లు గెలవడం అవసరమని అన్నారు. బీజేపీ నేతలు రాజ్యాంగం మార్చడం గురించి మాట్లాడుతున్నారంటే, బీజేపీ దేశంలో రిజర్వేషన్లను రద్దు చేసే ఆలోచనలో ఉందని చాలా మంది భావించడం మొదలయ్యింది. రిజర్వేషన్లను రద్దు చేయడానికే రాజ్యాంగం మార్చేస్తారనే అభిప్రాయం ప్రజల్లో బలపడడం బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు. ఈ వాస్తవాన్ని గుర్తించిన బీజేపీ నేతలు వెంటనే డామేజ్ కంట్రోల్ మొదలు పెట్టారు. స్వయంగా ప్రధాని మాట్లాడుతూ ఇప్పుడు స్వయంగా అంబేద్కర్ వచ్చినా సరే రాజ్యాంగాన్ని మార్చలేరని చెప్పారు. ఇప్పుడు ప్రధాని 400కు మించి సీట్లు అనే మాట చెప్పడం లేదు, కాని రాజ్యాంగాన్ని కాపాడ్డానికి, రిజర్వేషన్లను కాపాడ్డానికి తాను గెలవడం అవసర మన్నట్లు మాట్లాడుతున్నారు. క్రెడిబిల్ హిస్టరీ పేరుతో యూట్యూబ్ చానల్ నడుపుతున్న చరిత్రకారుడు అశోక్ కుమార్ పాండే ఈ వ్యాఖ్యలపై అద్భుతమైన కార్యక్రమం చేశారు. ఆ కార్యక్రమంలో ఆయన ఏమన్నారంటే - ఇప్పుడు రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడే ఆపద్బాంధవుడిలా మోడీ మాట్లాడుతున్నారని చెప్పారు. ఇప్పుడు బీజేపీని కాపాడ్డానికి ఆరెస్సెస్ కూడా రంగంలోకి దిగింది. ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ ఒక చిన్న వీడియో జారీ చేశారు. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లన్నింటికీ ఆరెస్సెస్ పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ఆరెస్సెస్ ఏర్పడినప్పటి నుంచి రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లను సమర్థిస్తుందని ఆయన చెప్పిన మాటలను అశోక్ కుమార్ పాండే విశ్లేషించారు. ఆయన ఏమన్నారంటే, ఆరెస్సెస్ గతంలో చెప్పిన మాటలన్నీ రికార్డులున్నాయి. సోషల్ మీడియాలో చరిత్ర తెలియని వారు, ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్‌లు రాసిన పుస్తకాలను ఎన్నడూ చదవని వారు ఇప్పుడు మోహన్ భగవత్ చెప్పిన మాటలను నమ్మవచ్చు కాని తనవంటి వారు, ఆరెస్సెస్‌పై పరిశోధనలు చేసిన వారు, ఆరెస్సెస్ గురించి రాయబడిన పుస్తకాలు, ఆరెస్సెస్ నేతలు రాసిన పుస్తకాలు చదివినవారికి మోహన్ భగవత్ చెప్పిన

మాటలు నమ్మడం కష్టమని అశోక్ కుమార్ పాండే అన్నారు. ఆయన కొన్ని పుస్తకాలను ఈ సందర్భంగా ఉదాహరించారు.

మొదటి పుస్తకం 'బంచ్ ఆఫ్ థాట్స్'. మాధవ్ సదాశివరావు గోల్వాల్కర్ చేసిన ప్రసంగాలు, ఆయన ఆలోచనలు, ఆయన ఇంటర్వ్యూల సంకలనం ఈ పుస్తకం. ఈ పుస్తకాన్ని ప్రచురించింది సాహిత్య సింధు ప్రకాశన్. ఇది ఆరెస్సెస్ వారి స్వంత ప్రచురణ సంస్థ. ఈ పుస్తకంలో పేజి నెంబర్ 356లో గోల్వాల్కర్ చెప్పిన మాటలున్నాయి. ఇది చాప్టర్ 28. అంటరానితనం - శాపము, చికిత్స అనే శీర్షిక క్రింద ఉన్న మాటలివి. ఇందులో ఒక ఉప శీర్షిక ఉంది... దాని పేరు సెట్ న్యూ క్రయిటీరియా. ఇందులో ఆయన ఏం చెప్పారంటే,

It goes without saying that if any one is suffering from any disability, social or political on account of what is called caste, that must be removed completely. Dr. Ambedkar had envisaged the special privileges for Scheduled Castes for 10 years fromt the we became a Republic in 1950.

అశోక్ కుమార్ ఈ పంక్తులు చదివి ఏమన్నారంటే, డా.అంబేద్కర్ షెడ్యూల్డు కులాలకు 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత కేవలం 10 సంవత్సరాల కాలానికి రిజర్వేషన్లు ఇచ్చారనే అబద్ధాన్నే ఇక్కడ చెప్పారని అన్నారు. ఆ తర్వాత అశోక్ కుమార్ పాండే మిగిలిన వాక్యాలు కూడా చదివారు. ఆ వాక్యాలు వినండి:

But it is going on... అవి ఇంకా కొనసాగుతున్నాయి. Being extended ఇంకా పెంచడం జరుగుతోంది Continued special privileges on the basis of caste only, is bound to create vested interests in them in remaining as a separate entity. కులం ఆధారంగా వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం కొనసాగితే, వారిలో స్వార్థభావాలు పెరుగుతాయి. వాళ్ళు ఒక ప్రత్యేక సముదాయంగా మాత్రమే కొనసాగాలనుకుంటారు. That would harm their integration with the rest of the society. దీనివల్ల మిగిలిన సమాజంలో వారి ఇంటిగ్రేషన్‌కు నష్టం కలిగిస్తుంది.

There are persons who are in real bad circumstances in all sections of society. There is no caste, which is without its own poor, the needy and the destitute. It would, therefore be proper that privileges should be based on the economic conditions of the people... అంటే రిజర్వేషన్లు కుల ప్రాతిపదికన కాదు, ఆర్థిక ప్రాతిపదికన ఉండాలని ఆయన వాదిస్తున్నారు. ఆ తర్వాత గోల్వాల్కర్ దాదాపు బెదిరిస్తున్న స్వరంతో చెప్పిన మాటలివి అంటూ అశోక్ కుమార్ పాండే మిగిలిన మాటలను కూడా ఆ వీడియోలో చదివి వినిపించారు. అవేమిటంటే - That will east out matters and the heart burning among other that the so called Harijans alone are enjoying privileges will also be removed. ఈ పంక్తులను అశోక్ కుమార్ పాండే తన మాటల్లో వివరించారు. ఆ వివరణ ఏమిటంటే, హరిజనులకు మాత్రమే మొత్తం సదుపాయాలు లభిస్తున్నాయనే అసూయాగ్నిని ఈ విధంగా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లతో చల్లార్చవచ్చని అన్నారు. ఈ మాటలు చెప్పింది మరెవరో కాదు ఆరెస్సెస్ చరిత్రలో రెండవ సర్ సంఘ్ చాలక్ గోల్వాల్కర్ చెప్పిన మాటలివి. ఆరెస్సెస్‌లో గొప్ప సిద్ధాంత కర్తగా, చాలా కాలం సర్ సంఘ్ చాలక్‌గా పనిచేసిన గోల్వాల్కర్ మాటలివి. ఇందులో మూడు ముఖ్యమైన మాటలున్నాయని అశోక్ కుమార్ పాండే వివరించారు. మొదటి మాట డా.అంబేద్కర్ కేవలం 10 సంవత్సరాల కాలానికి మాత్రమే రిజర్వేషన్లు ఇచ్చారన్నది. ఇది పచ్చి అబద్ధమని, రాజ్యాంగసభలో వాదనలను చదివితే ఈ పదేళ్ల వ్యవహారం కేవలం పార్లమెంటు, అసెంబ్లీల్లో దళితులకు, ఆదివాసీలకు లభించిన రిజర్వేషన్ల గురించినది. అంటే ఎన్నికల్లో దళితులకు, ఆదివాసీలకు కేటాయించే సీట్లకు సంబంధించిన చర్చ ఇది. పదేళ్ల తర్వాత సమీక్షించాలనే చర్చ జరిగింది. డా. అంబేద్కర్ ఈ విషయంలో కూడా పదేళ్ల పరిమితిని వ్యతిరేకించారని అశోక్ కుమార్ పాండే తెలిపారు. రాజ్యాంగ సభలో అంబేద్కర్ చెప్పిన మాటలను కూడా ఆయన ఉటంకించారు. అంబేద్కర్ ఏమన్నారంటే, 1935లో ఈ హక్కు దళితులకు లభించింది. ముస్లిములకు, క్రయిస్తవులకు అంతకు ముందే లభించింది. ఇప్పుడు 1948లో 13 సంవత్సరాల తర్వాత మనం మాట్లాడుకుంటున్నాం. మరో పదేళ్ళలో ఈ రిజర్వేషన్లను తొలగించాలని చెబుతున్నారు. ఇది మంచి విషయం కాదు, కాని అధిక సంఖ్యలో సభ్యులు ఇదే కోరుతున్నారు కాబట్టి ఒప్పుకుంటున్నానని అంబేద్కర్ చెప్పిన మాటలను వివరించారు. ఈ సందర్భంగా డా. అంబేద్కర్ ఒక మేధావిని కోట్ చేస్తూ ప్రజల హృదయాలు విశాలంగా ఉన్నప్పుడే గొప్ప నాగరికతలు ఏర్పడతాయని చెప్పారు. అంతేకాదు, ఆదివాసీల విషయంలో వెంటనే ఈ రిజర్వేషన్లను మరింత కాలం పొడిగించాలని కోరుతున్నట్లు కూడా అంబేద్కర్ అప్పట్లో చెప్పారని పాండే అన్నారు.

కాబట్టి మొదటి విషయం పదేళ్ల రిజర్వేషన్లు అన్న మాట ఉద్యోగాలు, విద్యారంగంలో రిజర్వేషన్లకు సంబంధించింది కానే కాదు. అది కేవలం పార్లమెంటు, అసెంబ్లీల్లో రిజర్వేషన్లకు సంబంధించిన చర్చ. ఈ విషయం గోల్వాల్కర్‌కు తెలియక పోవడం వల్ల ఇలా చెప్పి ఉండవచ్చు. లేదా తెలిసి కూడా అబద్ధం చెప్పి ఉండవచ్చని పాండే అన్నారు.

గోల్వాల్కర్ చెప్పిన రెండవ మాట కేవలం దళితులకు రిజర్వేషన్లు లభించడం వల్ల ఇతర కులాల్లోని పేదలకు చాలా బాధ కలుగుతుందన్న మాట. ఆరెస్సెస్ నేతలు ఈ రెండు మాటలను పదే పదే చెబుతూ వచ్చారు. ఈ రెండు మాటలు తప్పు. రిజర్వేషన్ పేదరిక నిర్మూలన కార్యక్రమం కాదు. పేదరిక నిర్మూలనకు రాజ్యాంగం చెప్పిన వివిధ నియమాల క్రింద విభిన్న ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాయి. నేడు అమలవుతున్న ఐదు కిలోల రేషన్ స్కీము కాని, మన్రేగా కాని ఇవన్నీ పేదరిక నిర్మూలన కార్యక్రమాలు. రిజర్వేషన్లు అనేవి ప్రాతినిధ్యానికి సంబంధించింది. సమాజంలో విభిన్న స్థాయిల్లో, ఉద్యోగాలు తదితర రంగాల్లో ఈ కులాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి ఉద్దేశించినవి రిజర్వేషన్లు. ప్రభుత్వ ఉద్యోగాల్లో అందరూ అగ్రవర్ణాల వాళ్ళే ఉంటే దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీన వర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించే అవకాశాలు తగ్గుతాయి. అందుకే ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ద్వారా ఈ కులాలకు అక్కడ ప్రాతినిధ్యం కల్పించడం జరిగింది. గోల్వాల్కర్ చెప్పిన రెండు మాటలు పదేళ్ల రిజర్వేషన్, పేదరిక నిర్మూలనకు రిజర్వేషన్లు అనే రెండు మాటలు అబద్దాలు. ఆరెస్సెస్ విచారధార కలిగిన వారు ఈ మాటలు పదే పదే చెబుతూ వస్తున్నారు. గోల్వాల్కర్ చెప్పిన చివరి మాట రిజర్వేషన్లు కులప్రాతిపదికన కాకుండా ఆర్థిక ప్రాతిపదికన ఇస్తే అప్పుడు మిగిలిన కులాల్లో ఉన్న అసూయ అసహనాలు చల్లారుతాయని చెప్పడం. దీన్ని విశ్లేషిస్తూ అశోక్ కుమార్ పాండే ఏమన్నారంటే, స్వతంత్రానికి ముందు రిజర్వేషన్లు లేనప్పుడు, 1935కి ముందు దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాల విషయంలో అగ్రవర్ణాలు చాలా ఉత్తమంగా వ్యవహరించారా? అని ఆయన ప్రశ్నించారు. కేవలం రిజర్వేషన్ల వల్లనే ఈ హార్ట్ బర్న్ ప్రారంభమయ్యిందా? దీనికి అసలు కారణం నిన్నటి వరకు అణిగిమణిగి మీ క్రింద పనిచేసిన వారు, మీకు ఎదురు చెప్పే సాహసం చేయలేనివారు, మీరు ఎప్పుడు చావగొట్టినా పడి ఉన్నవాళ్లు, మీరెంత కూలి చేయించిన కిమ్మనకుండా చేస్తూ వచ్చిన వాళ్ళు, వీళ్ళందరికి రిజర్వేషన్ల వల్ల విద్య, ఉద్యోగాల బలం లభించింది. వాళ్ళు సూటిగా చూసి మాట్లాడగలుగుతున్నారు. చదువుల్లోను రాణిస్తున్నారు. కొత్త కొత్త ఎత్తులకు ఎదుగుతున్నారు. ఇది అసలు హార్ట్‌బర్న్‌కు కారణమని పాండే అన్నారు. మోహన్ భాగవత్ చెప్పిన మాటలు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లకు ఆరెస్సెస్ ఎన్నడూ వ్యతిరేకం కాదన్న మాటలు అబద్దాలని అంటూ పాండే పాంచజన్య పత్రికను కూడా ఉదాహరించారు. ఇంగ్లీషులో ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్‌ను కూడా ఉదాహరించారు. అందులో మనుస్మృతిని రాజ్యాంగంగా మార్చాలన్న మాటలు కూడా ఉన్నాయని పాండే వివరించారు. ఇలాంటి చాలా మాటలున్నాయని, తాను వాటిని ఇక్కడ ప్రస్తావించడం లేదని, కేవలం గోల్వాల్కర్ బంచ్ ఆఫ్ థాట్స్ మాత్రమే ఉదాహరించానని చెప్పారు. మోహన్ భాగవత్ చెప్పిన మాటలు అబద్దాలని చెప్పడానికి ఇది చాలు అంటూ, బంచ్ ఆఫ్ థాట్స్ 344 పేజిలో ఆయన మనుస్మృతిని ప్రశంసించారని వివరించారు. మనుస్మృతి చతుర్వర్ణ వ్యవస్థ గురించి చెప్పే పుస్తకం. ఇందులో దళితులను అత్యంత క్రింది స్థాయిలో పెట్టడం జరిగింది. గోల్వాల్కర్ దీన్ని సమర్థించడం 'బంచ్ ఆఫ్ థాట్స్'లో చదవవచ్చని పాండే వివరించారు.

గోల్వాల్కర్‌తోపాటు వినాయక్ దామోదర్ సావర్కర్ మాటలను కూడా అశోక్ కుమార్ పాండే ఈ వీడియోలో వివరించారు. సావర్కర్ హిందూ మహాసభ అధ్యక్షుడిగా చేసిన ప్రసంగాలన్నీ హిందూరాష్ట్ర దర్శన్ అనే పుస్తకంగా సంకలనం చేయబడ్డాయి. ఈ పుస్తకం సావర్కర్ డాట్ ఓఆర్జీలో కూడా చూడవచ్చు. బీజేపీ ఈ లైబ్రరీలో కూడా ఇది దొరుకుతుందని పాండే చెప్పారు. సావర్కర్ డాట్ ఓఆర్జీలో ఉన్న ఈ పుస్తకంలోన పేజి నెంబర్

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

102లో సావర్కర్ జూన్ 20 1941లో భాగల్పూర్‌లో హిందూ మహాసభ అధ్యక్షుడి హోదాలో మాట్లాడుతూ నియామకాలన్నీ కేవలం మెరిట్ ఆధారంగా జరగాలన్నారు. అంటే కులప్రాతిపదికన రిజర్వేషన్లతో నియామకాలను ఆయన వ్యతిరేకించారు. మెరిట్ ఆధారంగా మాత్రమే నియామకాలు జరగాలన్నారు. మెరిట్ గురించి పాండే వివరిస్తూ ఎవరి తండ్రి అయినా ప్రొఫెసర్ అయితే, మరొకరు తండ్రి కూలివాడయితే, ప్రొఫెసర్ కుమారుడికి చిన్నప్పటి నుంచి చదివించే ప్రయత్నాలు జరుగుతాయి. మంచి శిక్షణ లభిస్తుంది. మంచి స్కూళ్ళలో చదువుకునే అవకాశం లభిస్తుంది. మంచి ఉపాధ్యాయులు దొరుకుతారు. తండ్రి ప్రొఫెసర్ అయితే ఆయన మిత్రులు సహోద్యోగులు కూడా సహాయ పడతారు. విద్యాసంబంధ వాతావరణం లభిస్తుంది. కాని ఒక కూలివాని కుమారుడికి తల్లిదండ్రులు నిరక్షరాస్యులు, ఇరుగుపొరుగులో చదువు విషయంలో సహాయపడే వారు ఉండరు. మంచి స్కూళ్ళకు వెళ్ళే ఆర్థిక స్థోమత ఉండదు. ప్రభుత్వ స్కూళ్ళలో చదువుకుని వస్తాడు. ఈ ఇద్దరి మధ్య పోటీ ఉన్నప్పుడు మెరిట్ గురించి మాట్లాడడంలో నిజాయితీ లేదు. మెరిట్ అన్నది కేవలం మేధోశక్తి మాత్రమే కాదు, పెరిగిన వాతావరణం, శిక్షణ ఇవన్నీ అందులో ఉంటాయి. మన సమాజంలో వందలాది సంవత్సరాలుగా చదువు కేవలం కొన్ని కులాలకే పరిమితమైన వాతావరణం ఉన్నప్పుడు, గుడులలో బ్రాహ్మణులకు మాత్రమే రిజర్వేషన్లు, పొలాల్లో కూలిపనులు చేసే రిజర్వేషన్లు కేవలం దళితులకు మాత్రమే కొనసాగిన వాతావరణం ఉన్నప్పుడు, ఇలాంటి సమాజంలో ఒకేమాదిరి మెరిట్ అందరికీ ఉండడం సాధ్యం కాదు. అందరికీ ఒకేమాదిరి సామాజిక స్థాయి ఉన్నప్పుడే మెరిట్ విషయంలో సమానమైన పోటీ ఉంటుంది. అందరికీ ఒకేస్థాయిలో విద్యా శిక్షణలు లభించినప్పుడే మెరిట్ విషయంలో సమానమైన పోటీ ఉంటుంది. ఈ మెరిట్ గురించి సావర్కర్ చెబుతున్నారు. కుల ప్రాతిపదికన రిజర్వేషన్లను స్పష్టంగా ఆయన వ్యతిరేకించారని పాండే వివరించారు. గోల్వాల్కర్, సావర్కర్ ఇద్దరు రిజర్వేషన్లను వ్యతిరేకించారని వివరించిన తర్వాత పాండే 2017 జనవరి 20వ తేదీన ఆరెస్సెస్ సిద్ధాంతకర్తల్లో ఒకరైన మన్మోహన్ వైద్య చెప్పిన మాటలను పాండే ఉదాహరించారు. భారతదేశంలో రిజర్వేషన్లు అవసరం లేదని, రిజర్వేషన్లు వేర్పాటువాదాన్ని పెంచుతాయని వైద్య చెప్పారు. ఈ మాటలు చెబుతూ పాండే వ్యంగ్యంగా రిజర్వేషన్లు లేకముందు బ్రాహ్మణులు, దళితులు ఒకే కంచంలో తింటూ, ఒకే వీధిలో నివసిస్తూ, కలిసిమెలిసి ఉండేవారా అని ప్రశ్నించారు. వూళ్ళలో దళితవాడలు వేరుగానే ఉంటాయని చెప్పారు. దళితులకు నీళ్ళబావి వేరుగా ఉండేదని, బ్రాహ్మణుల నీళ్ల వసతి వేరుగా ఉండేదని, ఠాకూర్లకు వేరుగా ఉండేదని, ఇది సత్యం కాదా అని ప్రశ్నించారు. అంటరానితనం ఈ దేశంలో నిజం కాదా అని అడిగారు. ప్రేమ్‌చంద్ రాసిన ఠాకూర్‌కా కుంవా కథను ఆయన ప్రస్తావించారు. ఆరెస్సెస్ నాయకుడు మన్మోహన్ వైద్యకు సమాజంలో ఉన్న ఈ వేర్పాటు కనిపించడం లేదు కాని రిజర్వేషన్ల వల్ల వేర్పాటు జరిగిపోతుందంటున్నాడని విమర్శించారు. అశోక్ కుమార్ పాండే స్వయంగా మోహన్ భాగవత్ గతంలో చెప్పిన మాటలను కూడా గుర్తు చేశారు. సెప్టెంబర్ 20, 2015వ తేదీన మోహన్ భాగవత్ మాట్లాడుతూ రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించవలసిన సమయం వచ్చేసిందని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది తర్వాత మోహన్ భాగవత్ రిజర్వేషన్లను సమీక్షించాలని చెప్పారు. ఆ తర్వాత ఆగష్టు 19, 2019లో బీహారు ఎన్నికలకు ముందు మోహన్ భాగవత్ మాట్లాడుతూ రిజర్వేషన్లపై చర్చ జరగాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యపై అప్పట్లో గగ్గోలు కూడా లేచింది. ఏది ఏమైనా ఆరెస్సెస్ రిజర్వేషన్లను ఎల్లప్పుడు సమర్థిస్తూ వచ్చిందని మోహన్ భగవత్ చెప్పిన మాటలు అబద్ధం. బీజేపీ ఐటి సెల్ హెడ్ అమిత్ మాలవ్య గతంలో చేసిన ఒక ట్వీట్ డిలీట్ చేసేశాడు. డిలీట్ చేసినా ఆ ట్వీటు చాలా మంది వద్ద ఉంది. మహిళలకు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ దేశంలో అన్ని విధాల రిజర్వేషన్లు రద్దవ్వాలని అన్నాడు. అశోక్ కుమార్ పాండే వీటన్నింటిని ఉదాహరిస్తూ, ఆరెస్సెస్ రిజర్వేషన్ల వ్యతిరేకతను అర్థం చేసుకోడానికి ఇవన్నీ అవసరం లేదని సోషల్ మీడియాలో, ఫేస్‌బుక్ కాని, ట్విటర్ కానీ, మరెక్కడైనా కాని రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న వారెవరూ పరిశీలించండని చెప్పారు. రాత్రింబవలు రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ రాసేవారు, వీడియోలు తీసేవారు, సోషల్ మీడియాలో ప్రచారం చేసేవారు ఎవరో పరిశీలిస్తే చాలన్నారు. వీళ్ళందరు ఆరెస్సెస్ భావాలు కలిగి ఉన్నవారేనన్నది అర్థమవుతుందని చెప్పారు. ఇందులో చాలా మంది మోదీ సమర్థకులు కూడా ఉంటారని అన్నారు. అశోక్ కుమార్ పాండే మరో మాట ఏం చెప్పారంటే, ఈ భావజాలం ఒక ప్యాకేజ్‌లా వస్తుందని, రిజర్వేషన్లను వ్యతిరేకించే వారిలో 99 శాతం మతతత్త్వవిషం నింపుకున్న వాళ్ళు ఉంటారని, మహిళల విషయంలోను అనుచిత వైఖరి కలిగి ఉంటారని ఇదంతా ఒక ప్యాకేజిగా కనిపిస్తుందని చెప్పారు. ❖

# మహా హక్కు మహత్తు మహా గొప్పది

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ



**ఈ ప్రపంచంలో హక్కులు అనేకం.** తల్లిదండ్రుల హక్కులు, భార్యా పిల్లల హక్కులు, బంధుమిత్రుల హక్కులు, ఇరుగు పొరుగు వారి హక్కులు, ముస్లింల హక్కులు, ముస్లిమేతరుల హక్కులు- వీటిలోని ప్రతి ఒక్కటి ముఖ్యమయినదే. కానీ, ఈ హక్కులన్నింటిలోకెల్లా మహా హక్కు- మనందరి సృష్టికర్తకు, నిజ ఆరాధ్యునికి మన మీదున్న హక్కు.

ఎందుకంటే, ఈ హక్కు మనకు ఉనికినిచ్చిన వాని హక్కు, అధికారులకు అధికారి, రాజులకు రాజు అయిన అల్లాహ్ హక్కు. అతల, వితల, సుతల తలా తల, రసాతల, మహాతల, పాతాల, భూలోక, భువర్లోక, స్వర్లోక, మహా లోక, జనోలోక, తపోలోక, సత్యలోక- 14 లోకాలుగా చెప్పబడుతున్న ఇవే కాదు ఇంకెన్ని లోకాలున్నా అన్నింటికి అధిపతి, యజమాని (రబ్బుల్ ఆలమీన్) అల్లాహ్‌యే. ఆయనే ప్రతి వస్తువు నిర్మాత. ఆయనే శూన్యం నుండి సృష్టి మొత్తాన్ని సృష్టించిన వాడు. ఆయనే మనల్ని అల్పమ యిన బిందువుతో పుట్టించి నఖ శిఖ పర్యంతం అందంగా తీర్చిదిద్దినవాడు. మూడేసి చీకట్ల పొరల లోపల తల్లి గర్భంలో మన యోగక్షేమాల్ని చూసినవాడు. భూమి మీద మనం అడుగు పెట్టకముందే మనక్కావాల్సిన వస్తువు సామగ్రినంతటిని సమకూర్చి పెట్టినవాడు. అంతటి ఘనాఘనుడు, మహిమాన్వి తుడు, మహోన్నతుని హక్కు ఎంత మహత్తరమయినదయి ఉంటుందో ఆలోచించండి! ఖుర్‌ఆన్ తెర లేపుతున్న ఈ యథార్థం ఎంత గొప్పదో యోచించండి!. ఆయనే మిమ్మల్ని మీ మాతృ గర్భాల నుండి, మీకేమీ తెలియని స్థితిలో బయటికి తీశాడు. మీ కొరకు చెవులను, కళ్లను, హృదయాలను తయారు చేసింది ఆయనే. మీరు కృతజ్ఞులుగా వ్యవహరిస్తారని".

(ఆలె ఇమ్రాన్:6)

మనం పుట్టినప్పుడు మనకెలాంటి లోక జ్ఞానం లేదు. అదృష్ట దురదృష్టాలంటే ఏమిటో కూడా మనకు తెలియదు. ప్రస్తుతం మనం అనగలుగుతున్నాం, వినగలుగుతున్నాం, కనగలుగు తున్నాం, మనుగడ సాగించగలుగుతున్నాం. అయినా మనం ఆయన పట్ల కృతజ్ఞులుగా మనగలగలేకపోతున్నాం!? ఇదే విషయాన్ని అల్లాహ్ ఇలా ప్రశ్నిస్తున్నాడు: "ఓ మానవుడా! పరమ దాత అయిన నీ ప్రభువును గూర్చి ఏ విషయం నిన్ను మోసంలో పడ వేసింది?" (ఇన్ఫితార్: 6)

మరో చోట ఇలా ఉంది: "వాస్తవానికి ఆకాశాలను, భూమిని సృష్టించడం, మానవులను సృష్టించడం కంటే ఎంతో గొప్ప విషయం. కానీ చాలా మంది ప్రజలకు ఇది తెలియదు".

(గాఫిర్: 57)

అల్లాహ్ మనకు ప్రసాదించిన ఈ తెలివితేటలు, శక్తియుక్తులు ఎందు కోసం? మనం మన జీవితాన్ని ఆయనకు అంకితం చేయ డానికి, ఆయన్ను మాత్రమే ఆరాధించడానికి. "యథార్థం- నేను మానవులను, జిన్నాతులను పుట్టించింది కేవలం వారు నన్ను ఆరాధించడానికే". (జారియాత్: 56)

ధర్మం నాలుగు పాదాల నడవాలని, శాంతి, సుస్థిరతల వాతావరణం నెలకొనాలని, ఎలాంటి భయం, ఆందోళనకర పరిస్థితులు ఉండకూడదని, ప్రతి ఒక్కరూ సజావుగా వారి మనుగడ కొనసాగించగలిగే వాతావరణం నెలకొనాలని మనలోని ప్రతి ఒక్కరూ ఆకాంక్షిస్తారు. దానికి మనం ఏం చేయాలో మనందరి ప్రభువయిన అల్లాహ్ సెలవిస్తున్నాడు: "వారు నన్ను మాత్రమే ఆరాధించాలి. నాకు సహవర్తులుగా ఎవరినీ కల్పించకూడదు". (అన్ నూర్: 55)

(ఇలా గనక మనం చేస్తే) "మీలో విశ్వసించి, సత్కార్యాలు చేసే వారితో అల్లాహ్ చేస్తున్న వాగ్దానం- 'వారి పూర్వీకుల్ని భూమికి ఉత్తరాధికారులుగా చేసినట్లే వారికి కూడా తప్పకుండా ప్రాతినిథ్యం వొసగుతాడు. తాను వారి కోసం సమ్మతించి ఆమోదించిన ధర్మాన్ని వారి కొరకు పటిష్టం చేసి, దానికి స్థిరత్వాన్ని కల్పిస్తాడు. వారికున్న భయాందోళనల స్థానే శాంతి భద్రతలను కల్పిస్తాడు". (అన్నూర్: 55)

అయితే మనిషి చేస్తున్నదేమిటి? దయానిధి అయిన అల్లాహ్ సన్నిధిని వదలి చెట్టు, పుట్ట, రాయి, రప్ప, వాగు, వంకను మ్రొక్కుతున్నాడు. అవి సంతృప్తి ఇవ్వకపోతే 'తానే స్వయంభువు' అని బీరాలు పోతున్నాడు. "ఏమిటి, నిన్ను మట్టితో తర్వాత వీర్య బిందువుతో పుట్టించిన, ఆ తర్వాత నిన్ను సంపూర్ణ మానవుడిగా తీర్చిదిద్దిన ఆయన్నే (అల్లాహ్‌నే) తిరస్కరిస్తున్నావా?" (కహఫ్: 37).

ఒక రూపాయి, అర్థ రూపాయి సహాయానికే మనం కృతజ్ఞతల్ని కోరుకుంటామే, మరి మనకు అపార అనుగ్రహాలతో సత్కరించిన ఆపద్బాంధవుని యెడల ఎందుకీ కృతఘ్నత? చేసిన సహాయాన్ని మరచిపోవడం మిత్ర ద్రోహం అయితే, అల్లాహ్ చేసిన అగణ్య మేళ్లను మరచి జీవించడం దైవద్రోహం కాదా? ఆయన్ను వదలి అన్యులను ఆశ్రయించడం, ఆరాధించడం మహాపరాధం కాదా?

సహీహ్ ముస్లిం, బుఖారీలోని ఓ హదీసులో హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ ఇలా అంటున్నారు: "నేనో దినం ప్రవక్త (స) వారి వెనకాల సవారీ అయి ఉన్నాను. ఆయన నన్నుద్దేశించి- "ఓ ముఆజ్!" అన్నారు. 'ఓ దైవప్రవక్తా నేను హాజరయి ఉన్నాను' అన్నాను. అప్పుడాయన (స)- "నీకు తెలుసా? దాసులపై అల్లాహ్‌కు గల హక్కు ఏమిటో? అల్లాహ్‌పై ఆయన దాసులకు గల హక్కు ఏమిటో?". నేనన్నాను- 'అల్లాహ్, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు'. అందుకాయన- "దాసులపై అల్లాహ్‌కు గల హక్కేమిటంటే, వారు ఆయన్ను మాత్రమే ఆరాధించాలి. ఆయనతోపాటు ఇంకెవ్వరికీ సాటి కల్పించరాదు. అల్లాహ్‌పై ఆయన దాసులకు గల హక్కు ఏమిటంటే, ఆయన్ను మాత్రమే ఆరాధించి, ఆయనతో పాటు ఇతరులెవ్వరినీ సాటి కల్పించకుండా జీవితం గడిపిన వారిని ఆయన శిక్షించడు". (ముత్తఫఖున్ అలైహి)

ఆయన దాసులమయిన మనం ఆయన ఆదేశాల హద్దుల్లోనే, ఆయన ప్రవక్త(స) బోధనల పద్ధుల్లోనే జీవించాలి. ఆయన మనకు ప్రసాదించిన అనుగ్రహాలకుగాను క్రియాత్మకంగా కృతజ్ఞతలు తెలుపుకోవాలి. అల్లాహ్ ఇలా అంటున్నాడు: "ఒకవేళ మీరు గనక కృతజ్ఞులుగా మసలుకుంటే నేను మీకు మరింత సమృద్ధిని కలుగజేస్తాను. ఒకవేళ మీరే గనక కృతఘ్నతకు పాల్పడితే నిశ్చయంగా నా శిక్ష చాలా కఠినంగా ఉంటుంది". (ఇబ్రాహీమ్:7)

క్రియాత్మకంగా ఆయనకు కృతజ్ఞతలు చెల్లించే ఓ విధానాన్ని ఆయనే స్వయంగా హదీసె ఖుద్సీలో తెలియజేస్తున్నాడు: "నా దాసుడు నా సామీప్యం పొందడానికి పాటించే పద్ధతుల్లో నేను అతనిపై విధిగావించిన వాటి(ఫరాయిజ్)ది ప్రథమ స్థానం. ఇవే కాక అతను నఫిల్ (స్వచ్ఛంద) ఆరాధనల ద్వారా కూడా నా సామీప్యాన్ని పొందే ప్రయత్నం చేస్తుంటాడు. కడకు నేనతన్ని ప్రేమించసాగినప్పుడు అతను వినే చెవినయి పోతాను. అతను కనే కంటినయి పోతాను. అతను పట్టుకునే చేయినయి పోతాను. అతను నడిచే కాలినయి పోతాను. అతను కోరిందల్లా అతనికనుగ్రహిస్తాను. అతను శరణు కోరిన వాటి నుండి అతన్ని కాపాడుతాను". (బుఖారీ)

అంటే, అల్లాహ్‌ను అంతలా ఆరాధించే దాసుడు, అల్లాహ్ ప్రేమను పొంది ఏ స్థాయికి చేరుకుంటాడంటే, ఆయన అనమన్నదే అంటాడు. ఆయన వినమన్నదే వింటాడు. ఆయన కనమన్నదే కంటాడు. ఆయన తినమన్నదే తింటాడు. ఆయన నడవమన్న దారినే నడుస్తాడు. ఆయన చేయమన్న కార్యాలే చేస్తాడు. ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా ఒక్క అడుగు కూడా వెయ్యడు. "అస్లిమ్-విధేయత చూపు" అని అల్లాహ్ ఆదేశించినప్పుడల్లా 'అస్లమ్తు- విధేయుణ్ణయ్యాను' అంటూ క్రియా పరంగా తాను నిజ ముస్లిం అని నిరూపించుకుంటాడు.

ఇక అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి అంటే, కేవలం నమాజు, రోజా, హజ్జ్, జకాత్- ఇవి మాత్రమే కాదు. మన జీవితానికి సంబంధించిన ప్రతి అంగం, ప్రతి రంగం ఆయన రంగులో రంగరించబడాలి. దుఆ చేయడం కూడా అల్లాహ్ ఆరాధనే. మొక్కుబడి చెల్లించడం కూడా అల్లాహ్ ఆరాధనే. భయపడటం, ఆశలు పెట్టుకోవడం కూడా అల్లాహ్ ఆరాధనే. అల్లాహ్ మాటల్లో చెప్పాలంటే: "ఇలా ప్రకటించు- నిశ్చయంగా నా నమాజు, నా

సకల ఉపాసనా రీతులు (ఖుర్బానీ), నా జీవితం, నా మరణం- సమస్తం సకల లోకాలకు ప్రభువయిన అల్లాహ్ కొరకే''. (అన్ఆమ్:162)

విశ్వ ప్రభువయిన అల్లాహ్ మహా హక్కు మహత్తు గురించి తెలిసి కూడా ఎవరయినా షిర్క్‌కి పాల్పడినట్లయితే, ఆయనతోపాటు ఇతరుల్ని సాటి కల్పించి పూజించినట్లయితే వారు ఓ విషయం తెలుసుకోవాలి! క్షమించరాని నేరం షిర్క్: 'నిశ్చయంగా అల్లాహ్ తనకు భాగస్వామిని కల్పించటాన్ని (షిర్క్‌ని) ఎన్నటికీ క్షమించడు. అది తప్ప దేన్నయినా తాను కోరిన వారిని క్షమిస్తాడు. అల్లాహ్‌కు సాటి కల్పించిన వాడే, వాస్తవంగా మహాపరాధానికి పాల్పడిన వాడు''. (అన్ నిసా:48) ఎందుకంటే, ''నిశ్చయంగా అల్లాహ్‌కు భాగస్వాముల్ని కల్పించడం (షిర్క్) ఘోరాతిఘోరమయిన దౌర్జన్యం''. (లుఖ్మాన్: 13)

## సర్వ కర్మ వినాశిని షిర్క్

''ఒకవేళ నీవు బహుదైవారాధన (షిర్క్) చేసినట్లయితే నీ కర్మలన్ని వ్యర్థమయి పోతాయి. నీవు నష్టానికి గురయిన వారిలో చేరి పోతావు''. (అజ్జుమర్: 65)

## స్వర్గ ప్రవేశానికి అవరోధం షిర్క్

''వాస్తవానికి ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాముల్ని చేసేవారికి, నిశ్చయంగా అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడు. వారి నివాసం నరకాగ్నియే!''. (మాయిదహ్: 72)

ప్రియ పాఠకుల్లారా! మనం బాల్యం నుండి తౌహీద్, షిర్క్ అన్న పదాలు తరచూ వింటూనే ఎదిగాము. అయితే ఆ రెండు పదాల వాస్తవ అర్థం తెలియని కారణంగా మనలోని చాలా మంది తౌహీద్‌కు దూరంగా, షిర్క్‌కి అతి దగ్గరగా జీవిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే షిర్క్‌నే తౌహీద్‌గా భావిస్తున్నారు. కాబట్టి మన వైఖరి మారాలి. మనలో మార్పు రావాలి. ఇలా జరగాలంటే తౌహీద్, షిర్క్ గురించి ఖచ్చితమయిన జ్ఞానం మనకుండాలి. ఈ మార్గంలో షైతాన్ పన్నే కుట్రలు, వేసే ఎత్తుగడలు, విసిరే విష వలల పట్ల కడు అప్రమత్తంగా ఉండాలి. అందుకు అల్లాహ్ ఆదేశం మనందరికీ శిరోధార్యం అవ్వాలి.

''ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు కర్తవ్య పాలనగా అల్లాహ్ యెడల భయభక్తులు కలిగి ఉండండి. మీరు (అల్లాహ్‌కు) విధేయులుగా (ముస్లింలుగా) ఉన్న స్థితిలో తప్ప మీకు మరణం రాకూడదు''. (ఆలె ఇమ్రాన్: 102)

ప్రవక్తలందరూ తమ సంతానానికి చేసిన అంతిమ హితవు మనందరికీ ఆచరణీయం అవ్వాలి:

''నా బిడ్డలారా! నిశ్చయంగా అల్లాహ్ మీ కొరకు (ఇస్లాం) ధర్మాన్నే ఎన్నుకున్నాడు. కాబట్టి మీరు (అల్లాహ్‌కు) విధేయులుగా (ముస్లింలుగా) ఉన్న స్థితిలో తప్ప మీకు మరణం రాకూడదు సుమా!''. (అల్ బఖరహ్: 132)


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# అబద్ధం చెప్పడం మానుకో

- ముహమ్మద్ వహీదుద్దీన్

**మనిషి**లోని మనసుకు, అతని నోటికి మధ్య సమన్వయం, పొంతన ఉన్నప్పుడే మనిషి చెప్పే ప్రతి మాట, అతను చేసే ప్రతి పని సజావుగా ఉంటుంది. దీనినే 'సత్యం' లేక 'సచ్ఛీలత' అంటారు. సత్యం చెప్పనివాని హృదయం సకల రుగ్మతలకు పుట్టినిల్లుగా మారుతుంది. సత్యం పలికే వానికి ప్రతి మంచి పని సులభ సాధ్యమవుతుంది. అతను ప్రతి కఠినమయిన దశనూ అలవోకగా అధిగమిస్తాడు. ఒక వ్యక్తి దైవప్రవక్త(స) వద్దకు వచ్చి ఇలా విన్నవించుకున్నాడు:

దైవప్రవక్తా! నాలో నాలుగు దుర్గుణాలున్నాయి: 1) నేను వ్యభిచారం చేస్తాను 2) దొంగతనం చేస్తాను 3) మద్యం సేవిస్తాను 4) అబద్ధం చెబుతాను. తమరు నాకు ఆజ్ఞాపిస్తే వీటిలో ఏ ఒక్కదానినయినా పరిత్యజించగలను. అప్పుడు ప్రవక్త 'అబద్ధం చెప్పడం మానుకో' అని బోధించారు. దాని కతను అంగీకరిస్తూ ఈ క్షణం నుండి అబద్ధం చెప్పనంటూ ప్రమాణం చేశాడు. ఆ రోజు సాయంత్రమవగానే అతని మనసు సారాయి వైపునకు లాగింది. ముందు సారాయి త్రాగి, ఆ తరువాత వ్యభిచారం చేయాలనుకున్నాడు. కాని తెల్ల వారాక దైవప్రవక్త(స) అడిగితే ఏం చెప్పను? నిజం చెబితే మద్యం తాగినందుకు, వ్యభిచారం చేసినందుకు శిక్ష పడు తుంది. అబద్ధం చెబితే ప్రమాణ భంగం చేసినట్లవుతుంది అని ఆలోచించుకుంటూ గడిపాడు. రాత్రి బాగా చీకటి పడిన తరువాత దొంతనం చేయడానికి బయలుదేరబోయాడు. కాని రేపు ఉదయం ప్రవక్త(స) అడిగితే ఏమని చెప్పను? అన్న ఆలోచన వచ్చింది. రాత్రి దొంగతనం చేశానని అంటే తన చేయి నరకబడుతుంది. లేదని అంటే వాగ్దాన భంగానికి పాల్పడిన వాడనవుతాను. దాంతో అతను ఈ మూడు నుండి తనను కట్టి పడేసుకున్నాడు. తెల్లవారాక అతను పరుగెత్తు కుంటూ ప్రవక్త(స) సన్నిధికి వచ్చాడు. దైవప్రవక్తా! అబద్ధం చెప్పకూడదన్న దృఢ సంకల్పం మూలంగా నాలోని నాలుగు దుర్గుణాలు కూడా దూరమయ్యాయి అని చెప్పాడు. ఇది విని దైవప్రవక్త(స) చాలా సంతోషపడ్డారు.

సత్యం చెప్పే గుణం మనిషిని ఎన్నో చెడుగుల నుండి దూరం ఉంచుతుంది. సత్యవంతులైన వారు ప్రతి చెడుగు నుండి పవిత్రంగా ఉండేందుకు తప్పక ప్రయత్నిస్తారు. అంతేకాదు, వారు రుజువర్తనులై ఉంటారు. ముక్కుసూటిగా వ్యవహరి స్తారు. చేసిన వాగ్దానాన్ని నిలుపుకుంటారు. ఒడంబడికలకు కట్టుబడి ఉంటారు. ధైర్యంగా ఉంటారు. మనసు నిర్మలంగా ఉంటుంది. ప్రవర్శనాబుద్ధి ఉండదు. ఆంతర్యంలో కపటత్వం ఉండదు. ముందు ఒక విధంగా, వెనుక ఒక విధంగా ఉండటం, ఉన్నట్లు నటించడం అబ్బదు. అందరు నమ్మదగ్గ నేస్తంగా ఉంటారు. వారి మాటలపై, చేతలపై జనులకు నమ్మకం ఉంటుంది. ఎందుకంటే మాటలకు చేతలకు మధ్య వైరుధ్యం ఉండదు. చెప్పిన దానిని చేసి చూపిస్తారు. సత్యం, సచ్ఛీలత ఎన్నో సుగుణాలకు అసలు సిసలు ప్రాతిపదిక అవుతుంది.


అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు : "అల్లాహ్ మాటకంటే మరెవరి మాట నిజం కాగలదు?" (అన్ నిసా: 87)

"ఎవరైతే సత్యాన్ని తీసుకువచ్చారో, మరెవరైతే సత్యాన్ని నిజమని ధ్రువీకరించారో- అలాంటి వారే భయభక్తులు కల వారు". (అజ్ జుమర్ : 33)

విశ్వాసులారా! దైవానికి భయపడండి. సత్యవంతులకు తోడుగా ఉండండి. (అత్ తౌబా : 119)

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం

సహజీవన భావనల సాపురాయి
గీటురాయి
వారపత్రిక




## ఇస్లాం అంటే ఏమిటి? ముస్లింలు ఎవరు?

ఇస్లాం విశ్వజనీనమైన ధర్మం. ఆధ్యాత్మిక ఆచరణలు, ప్రాపంచిక ఆచరణల మధ్య సమతుల్యం ఉన్న సంపూర్ణ జీవన విధానం ఇస్లాం. ఇస్లాం అనే అరబిక్ పదానికి శాంతి, సమర్పణ, విధేయత అని అర్థాలున్నాయి. కాబట్టి, ముస్లిం అంటే దేవుని చిత్తానికి లోబడి శాంతి, ప్రేమలను మనుషులకు పంచేవాడు.

'అల్లాహ్' అనే అరబిక్ పదానికి అర్థం దైవం. దేవుడు కరుణామయుడు, ప్రేమగలవాడని, మహా జ్ఞాని, విశ్వంలోని సమస్త సృష్టి పట్ల న్యాయశీలి అని ముస్లింలు విశ్వసిస్తారు. ముస్లింలు ఒకే ఒక్క నిజమైన దైవాన్ని ఆరాధిస్తారు. (దైవం సాటిలేనివాడు. అద్వితీయుడు. ఎవరి అవసరం లేనివాడు. ఎలాంటి అగత్యము లేనివాడు. ఆయనకు సంతానం లేరు. భాగస్వాములులేరు. తల్లిదండ్రులు లేరు. దైవంతో పోల్చదగింది ఏదీ లేదు) ముస్లింలు అల్లాహ్ ను మాత్రమే ఆరాధిస్తారు. అల్లాహ్ నుంచి మాత్రమే సహాయం అర్థిస్తారు. సాఫల్యాన్ని ప్రసాదించేది అల్లాహ్ మాత్రమే. ఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలనూ క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించే వాడూను." (దివ్య ఖుర్ఆన్: 39:53)

ఇస్లాం కొత్త మతం కాదు. దైవప్రవక్తలు అందరూ తీసుకువచ్చిన సందేశం ఇదే. "ఒకే నిజమైన దేవునికి విధేయత చూపండి" అన్నదే ఆ సందేశం. ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా మానవాళికి దైవం పంపించిన దైవసందేశం సమగ్రమైనది, సంపూర్ణమైనది. చిట్ట చివరిది. ప్రవక్త ముహమ్మద్ (స) చిట్టచివరి దైవప్రవక్త అని ముస్లిములు విశ్వసిస్తారు.

## ఇస్లాంలోని మౌలిక విశ్వాసాలు

1. అన్ని ఆరాధనలకు అర్హుడైన ఒకే ఒక్క దైవం (అల్లాహ్)ను విశ్వసించడం
2. దేవదూతలను విశ్వసించడం
3. అల్లాహ్ పంపిన అందరు ప్రవక్తలను విశ్వసించడం. (ఆదమ్, నూహ్, ఇబ్రాహీం, మూసా, క్రీస్తు, చివరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం).
4. దైవం పంపిన దైవగ్రంథాలన్నింటిని విశ్వసించడం.
5. తీర్పుదినాన్ని విశ్వసించడం.
6. విధిని విశ్వసించడం. అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసునని, అన్నింటినీ నమోదు చేశాడని నమ్మడం.

## ఇస్లాంలోని ఐదు మూలస్తంభాలు

**1. విశ్వాస ప్రకటన**

ఒకే ఒక్క దైవం తప్ప ఆరాధనకు అర్హుడు మరొకరు లేరని, ముహమ్మద్ (స) అల్లాహ్ పంపిన ప్రవక్త అని ప్రకటించడం. చిత్తశుద్ధితో చేయవలసిన ప్రకటన ఇది.

**2. సలాత్: ప్రార్థన:**

ప్రార్థనలు రోజుకు ఐదు సార్లు చేయాలి. దైవానికి దాసునికి మధ్య ప్రత్యక్ష సంబంధం సలాత్ లేదా నమాజ్. ఈ ప్రార్థనలు తెల్లవారు జామున, మధ్యాహ్నం, సాయంత్రం, సూర్యాస్తమయం తర్వాత, రాత్రి చేసే ప్రార్థనలు. ఇలా ఐదు పూటల ప్రార్థనలు ప్రతిరోజు లయబద్ధంగా జరుగుతాయి. అవి అల్లాపై విశ్వాసాన్ని బలపరు స్తాయి, మనిషిలో దైవభక్తిని ఉత్తేజపరుస్తాయి. మనిషిలో ఉన్నత నైతికతకు ప్రేరేపిస్తాయి. హృదయాన్ని శుద్ధి చేస్తాయి. తప్పులు, చెడుల వైపు ప్రలోభాలను నిరోధిస్తాయి. ప్రతి ప్రార్థనకు కొన్ని నిముషాల సమయం మాత్రమే అవసరం. ఇవి శారీరక, ఆధ్యాత్మిక ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మస్జిదులో కలిసి సామూహికంగా ఆరాధించడం ఉత్తమం. అయితే ఒక ముస్లిం పొలాలు, కార్యాలయాలు, కర్మాగారాలు, విశ్వవిద్యాల

యాలు వంటి ప్రదేశాల్లో ఎక్కడ ఉన్నా ప్రార్థన సమయమైతే అక్కడ ప్రార్థన చేసుకోవచ్చు.

"సలాత్" లేదా నమాజ్ లేదా ప్రార్థన ప్రయోజనాలపై అధ్యయనాలు జరిగాయి. సరిగ్గా, సరైన భంగిమలతో నమాజ్ చేసినప్పుడు, ఆధ్యాత్మిక శ్రేయస్సుతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కూడా ఇస్తాయని, కండరాల బలం, కీళ్ల కదలిక, రక్త ప్రసరణలకు తోడ్పడతాయని తెలుస్తోంది. ఈ ప్రయోజనాలన్నీ అదనపు ప్రయోజనాలు మాత్రమే. అసలు లక్ష్యం దైవాదేశాలను పాటించడం.

**3. 'జకాత్'- తప్పనిసరి దానం**

జకాత్ అనే పదానికి 'శుద్ధి', 'వృద్ధి' అనే అర్థాలు ఉన్నాయి. మన సంపద నుంచి కొంత శాతం అవసరమైన వారికి ఇవ్వడం వల్ల మన ఆస్తులు శుద్ధి చేయబడతాయి. మొక్కల కత్తిరింపు వలె, ఈ కోత వల్ల కొత్త వృద్ధి లభిస్తుంది. సంపదలో సమతుల్యం ప్రాప్తిస్తుంది.

ప్రతి ముస్లిం ప్రతి సంవత్సరం తన ఖర్చులు పోగా మిగిలిన సంపదలో 2.5% జకాత్ చెల్లిస్తారు. ఇది ఒక ధార్మిక విధిగా ప్రతి ముస్లిం చెల్లిస్తారు. జకాత్ ద్వారా పేదలను ఆదుకుంటారు. వితంతువులు, అనాథలు, వికలాంగులు, నిరుపేదలను ఈ విధంగా ఆదుకోవడం జరుగుతుంది.

**4 . రోజా లేదా ఉపవాసం**

ప్రతి సంవత్సరం రమజాను మాసంలో, అంటే ఇస్లామీ కేలండరులోని తొమ్మిదో నెల రమజానులో ముస్లిములు పొద్దుపొడువక ముందు నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసాన్ని పాటిస్తారు. అన్నపానీయాలకు దూరంగా ఉంటారు. లైంగిక సంబంధాలకు దూరంగా ఉంటారు. మనిషిలో ధార్మిక విశ్వాసాన్ని పెంచడానికి, దైవానికి మరింత దగ్గర చేయడానికి ఉద్దేశించింది ఉపవాసం. తన భౌతిక అవసరాలను ఆనందాలను వదులుకోవడం ద్వారా మనిషి దైవానికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తాడు. ఉపవాసం అంటే కేవలం అన్నపానీయాలు మానేయడం మాత్రమే కాదు. పలికితే సత్యమే పలకాలి, మాటల్లో చేతల్లో అసత్యానికి దూరంగా ఉండాలి. ఇతరులకు హాని బాధ కలిగించకుండా ఉండాలి. అంటే ఉపవాసం సహనాన్ని నేర్పుతుంది. ఆత్మను శరీరాన్ని నియంత్రించుకునే శక్తిని ఇస్తుంది. క్రమశిక్షణ గరుపుతుంది. ఆగ్రహావేశాలు అదుపులో ఉంచుకునేలా శిక్షణ ఇస్తుంది. అంతేకాదు, ప్రపంచంలో ఉన్న నిరుపేదలు, నిర్భాగ్యుల కష్టాలను, బాధలను అర్థం చేసుకునేలా చేస్తుంది. ఈ ప్రపంచంలో మనిషి తన అలవాట్లకు, సుఖసంతోషాలకు బానిస కాదని, కేవలం దైవానికి మాత్రమే దాసుడని ఉపవాసం ద్వారా ప్రకటించడం జరుగుతుంది. అన్నింటికి మించి రమజాన్ అనేది దానధర్మాల మాసం, ఆహారాన్ని పంచుకుని అందరూ కలిసి తినే మాసం.

ఉపవాసం వల్ల లభించే కొన్ని ప్రయోజనాలేమిటంటే చెడు అలవాట్లను వదులుకోవచ్చు. కొలెస్టరాల్ తగ్గుతుంది. శరీరంలో విషపదార్థాలు బయటకుపోతాయి. మెదడు చురుకుదనం పెరుగుతుంది.

**5. హజ్ యాత్ర**

ఏడాదికి ఒక సారి స్థోమత ఉన్న ప్రతి ముస్లిం మక్కా నగరంలోని కాబా గృహానికి హజ్ యాత్ర చేయడం తప్పనిసరి. ఆర్థికంగా, శారీరకంగా స్థోమత ఉన్న ప్రతి ముస్లిం చేయవలసిన యాత్ర ఇది. లక్షలాది ముస్లిములు అనేక దేశాల వారు, అనేక జాతుల వారు, అనేక భాషలవారు, విభిన్న రంగుల ప్రజలు, వివిధ సంస్కృతులకు చెందినవారు స్త్రీలు పురుషులు అందరూ ఎలాంటి తరతమ భేదం లేకుండా, ఎలాంటి నిమ్నోన్నతాభావాలు లేకుండా, మక్కా నగరంలో కలుసుకునే అంతర్జాతీయ మహాసమావేశమే హజ్ యాత్ర.

ఒకే ఒక్క దైవం అల్లాహ్‌ను సామూహికంగా ఆరాధించడమే హజ్ ఉద్దేశ్యం. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల ముస్లిములు కలుసుకునే అంతర్జాతీయ సౌభ్రాతృత్వ మహోత్సవం హజ్. హజ్ యాత్రికులు ప్రత్యేకమైన, ఒకే మాదిరి దుస్తులు ధరిస్తారు. దానివల్ల సంపన్నులు, పేదవారు, విభిన్న సంస్కృతుల వారన్న తేడా ఎక్కడా కనిపించదు. అందరూ దైవం ముందు సమానంగా హాజరవుతారు. హజ్ యాత్రలో ప్రతి ముస్లిం అనేక విషయాలు తెలుసుకుంటాడు. సమైక్యత, సమానత్వం, సోదరభావం, సహనం, ఓర్పు వంటివి అనేక ఉన్నత విలువలు అలవరచు కుంటాడు.

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# కుటుంబ వ్యవస్థ

**(మౌలానా సయ్యద్ జలాలుద్దీన్ ఉమరీ రాసిన "దివ్య ఖుర్‌ఆన్ - కుటుంబ వ్యవస్థ" పుస్తకం నుంచి)**




**ఇస్లామ్** కుటుంబ వ్యవస్థను పటిష్టం చేసింది. దైవికమైన హితబోధలు లోపించడం వల్ల, మనోవాంఛల వల్ల, దౌర్జన్యాలు అన్యాయాల వల్ల కుటుంబవ్యవస్థలో చోటు చేసుకున్న అనేక రుగ్మతలను తొలగించింది. దివ్య ఖుర్‌ఆన్‌లో ఈ రుగ్మతల గురించి వివరంగా ఉంది. ఈ రుగ్మతలను ఎలా దూరం చేసు కోవాలో కూడా చెప్పింది. కుటుంబ వ్యవస్థలో చోటు చేసుకున్న రుగ్మతలను దూరం చేయడమే కాదు, ఒక ఆదర్శ కుటుంబం గురించి తెలియజేస్తూ, కుటుంబం అంటే ఇలా ఉండాలని చెప్పింది. సమస్యలు తలెత్తితే ఎలా పరిష్కరించుకోవాలో చెప్పింది. ఈ విధంగా సహజంగా కుటుంబానికి కావలసిన అవసరాలు నెరవేరడమే కాదు, న్యాయానికి సంబంధించిన లోటుపాట్లు కూడా ఉండని వ్యవస్థను ఇచ్చింది. పవిత్రమైన, సంస్కారయుత మైన సమాజ నిర్మాణానికి ఆరోగ్యవంతమైన కుటుంబం తప్పనిసరి అవసరంగా దివ్య ఖుర్‌ఆన్ బోధిస్తుంది. ఏ కాలంలో అయినా, ఎలాంటి పరిస్థితులు ఉన్నా, కుటుంబం ఒక శాశ్వతమైన, పటిష్టమైన వ్యవస్థగా ఉండాలని ఖుర్‌ఆన్ కోరుతుంది.

కుటుంబం అన్నది స్త్రీ పురుషుల లైంగిక సంబంధం వల్ల ఏర్పడుతుంది. లైంగిక వాంఛల పరిపూర్తి మనిషికి సహజమైన అవసరంగా ఇస్లామ్ గుర్తిస్తుంది. నికాహ్ ద్వారా మాత్రమే మనిషి తన లైంగిక కోరికలు తీర్చుకోవాలి. ఇది ధర్మసమ్మతం మాత్రమే కాదు, పుణ్యప్రదం అని కూడా చెప్పింది. ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (స) ప్రతి మంచి పనిలోను పుణ్యం లభిస్తుందని చెబుతూ, మీ లైంగిక కార్యాలలోను పుణ్యం ఉందని అన్నారు. అప్పుడు అనుచరులు ఆయనతో, మనిషి తన కోరిక తీర్చుకుంటే దానికి కూడా పుణ్యం లభిస్తుందా అని ప్రశ్నించారు. అప్పుడు ప్రవక్త "మీ అభిప్రాయం ఏమిటి? మనిషి తన కోరికను తప్పుడు పద్ధతిలో తీర్చుకుంటే పాపం లభించదా? అదేవిధంగా సరయిన పద్ధతిలో కోరిక తీర్చుకుంటే పుణ్యం కూడా లభిస్తుంది." (సహీహ్ ముస్లిమ్, కితాబుజ్జకాత్)

లైంగిక వాంఛలను అణచుకోవడం అన్నది మనిషి నైజానికి విరుద్ధం. ఈ ప్రయత్నం ఫలించేది కాదు. దీన్ని ఇస్లామ్ కఠినంగా నివారించింది. ప్రవక్త అనుచరులు కొందరు ఈ విధంగా అన్నీ పరిత్యజించి సన్యసించాలన్న వైఖరి ప్రదర్శించినప్పుడు ప్రవక్త వారిని నివారిస్తూ అలా చేసే అనుమతి ఇస్లామ్‌లో లేదని అన్నారు.

నికాహ్ ద్వారా మనిషి పవిత్రమైన, గౌరవప్రదమైన జీవితం గడప గలడు. చెడు పనులకు దూరంగా ఉండగలడు. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు:

"యువకులారా! వివాహం చేసుకునే స్థోమత ఉన్నవారు వివాహం చేసుకోవాలి." (సహీహ్ బుఖారి, కితాబున్నికాహ్)

నికాహ్ సంబంధం ప్రేమాభిమానాల సంబంధంగా దివ్యఖుర్‌ఆన్ పేర్కొంటుంది. ప్రేమ సహజమైనది, ఇరువైపుల ఉండేది. ఈ ప్రేమాభిమానాల సంబంధం వల్ల జీవితంలోని చికాకులు, అస్థిమితం, మనోవైకల్యాలు దూరమవుతాయి. ప్రశాంతత

లభిస్తుంది. మనిషి తనకు పరిచయంలేని అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. చాలా సందర్భాల్లో పెళ్ళాడిన అమ్మాయితో అంతకు ముందు పరిచయమే ఉండదు. కాని నికాహ్ తర్వాత వారి మధ్య ప్రేమ చిగురిస్తుంది. ఇది కూడా దేవుని చిహ్నాల్లో ఒకటి:

"ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు- మీరు వారివద్ద శాంతిని పొందటానికి, మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్నీ సృజించాడు. నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి." (అర్రూమ్ 21)

నికాహ్ లక్ష్యాలలో దంపతులు ఒకరి నుంచి మరొకరు ప్రశాంతత పొందడం కూడా ఒకటిగా ఈ వాక్యంలో చెప్పడం జరిగింది. ఈ వాక్యంలో ఉన్న మరో విషయం నికాహ్ ద్వారా అల్లాహ్ దంపతుల మధ్య ప్రేమ సృష్టిస్తాడు. ఇక్కడ ప్రేమ ఇద్దరి తరపున ఉండాలన్న సూచన కూడా ఉంది. ఒక వైపున మాత్రమే ప్రేమ ఉంటే ఎక్కువ కాలం నిలబడదు. ప్రశాంతత విషయానికి వస్తే జీవితంలోని పరుగుల్లో, ఆందోళనల్లో భర్తకు ఇంట భార్య వద్ద మాత్రమే ప్రశాంతత లభిస్తుంది. అదేవిధంగా భార్యకు కూడా భర్త వద్దనే ప్రశాంతత, సాంత్వన లభిస్తాయి. నేడు మనిషి ప్రశాంతత కోసం పరితపిస్తున్నాడు. ప్రాపంచికంగా ఎంత ప్రగతి సాధించినా ప్రశాంతత కరువయ్యింది. ప్రశాంతత కావాలనుకుంటే దాంపత్య జీవితం గడపాలని దివ్యఖుర్ఆన్ బోధించింది. ఆలోచించేవారికి, పరిశీలించేవారికి ఇందులో అనేక సూచనలున్నాయి.

దంపతుల మధ్య సంబంధం ఏ విధంగా ఉండాలో దివ్య ఖుర్ఆన్ ఈ విధంగా తెలిపింది:

"వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు" (అల్ బఖర 187).

దివ్య ఖుర్ఆన్‌లోని ఈ వాక్యాన్ని తరచి చూసిన కొద్దీ కొత్త కొత్త భావాలు మన ముందుకు వస్తాయి. దివ్యఖుర్ఆన్ ఎంత గొప్పగా, ఎంత అర్థవంతంగా పోలిక చెప్పిందో అని ఆశ్చర్యపోతాం. మనిషి దుస్తులు మనిషికి అతి సమీపంగా ఉంటాయి. అంతకన్నా దగ్గరగా మరేదీ ఉండదు. మీరు స్త్రీలకు దుస్తుల వంటివారు, స్త్రీలు మీకు దుస్తుల వంటి వారని దివ్యఖుర్ఆన్ చెప్పింది. భార్యాభర్తల మధ్య సాన్నిహిత్యాన్ని సూచించడానికి ఇంతకన్నా గొప్ప పోలిక మరొకటి ఉండదు. దుస్తులు మన శరీరంలో లోపాలను కప్పి పుచ్చుతాయి. శరీరంలో ఏ భాగాన దుస్తులు ఉంటాయో అక్కడ ఎలాంటి పుండ్లు, గాయాలు, మచ్చలు లేదా మరో లోపం ఏది ఉన్నా దుస్తులు దాన్ని కప్పేస్తాయి. దివ్య ఖుర్ఆన్ ఇదే చెబుతోంది. నీవు భార్యకు దుస్తుల వంటి వాడివి. భార్య నీకు దుస్తుల వంటిది. ఒకరు మరొకరికి ఆచ్ఛాదన వంటి వారు.

## దాంపత్య సంబంధాలు దెబ్బతింటే

దాంపత్య సంబంధం ఎల్లప్పుడు సంతోషంగా కొనసాగకపోవచ్చు. ఒక్కోసారి మనస్పర్థలు, పొరపొచ్చాలు రావచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మనిషి సహనంతోను, ఓర్పుతోను వ్యవహరించాలని ఇస్లామ్ బోధిస్తుంది. వివేకంతో, వివేచనతో, అవగాహనతో సమస్యలు పరిష్కరించుకోడానికి ప్రయత్నించాలి. ఈ ప్రయత్నాలు చేసినప్పటికీ భార్యాభర్తల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిని వారు తమ మధ్య మనస్పర్థలను దూరం చేసుకోలేని పరిస్థితి తలెత్తవచ్చు. అలాంటి పరిస్థితిలో దివ్యఖుర్ఆన్ బోధనలేమంటే ఇరువురి తరపు నుంచి ఒక్కో వ్యక్తిని మధ్యవర్తిగా నియమించుకోవాలి. వారిద్దరు అవగాహనతో, చర్చల ద్వారా సమస్య పరిష్కరించే ప్రయత్నం చేయాలి. సాధారణంగా ఉడుకురక్తం కలిగిన యువతీ యువకులైతే ఆవేశం ఉంటుంది. ఆవేశంలో మాట తూలడం జరగవచ్చు. కొన్ని సందర్భాల్లో ఇరువురి కుటుంబాల సభ్యులు కూడా అవగాహన లేకుండా మాట్లాడి సమస్యను మరింత జటిలం చేయవచ్చు. అయితే నిజాయితిగా ఇరువురి తరపున పెద్దమనుషులు సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తే పరిష్కారం సాధ్యమే. దివ్యఖుర్ఆన్ ఇలా ప్రకటించింది:

"భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయనే భయం మీకు కలిగితే, భర్త బంధువుల నుండి ఒక మధ్యవర్తిని, భార్య బంధువుల నుండి ఒక మధ్యవర్తిని నియమించండి. వారిద్దరు సంస్కరణను కోరితే అల్లాహ్ వారి మధ్యన సమాధానం కుదరటానికి మార్గం చూపుతాడు. అల్లాహ్ సర్వజ్ఞాని, సకలమూ ఎరిగినవాడు".

(నిసా: 35)

ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే దంపతులు సయోధ్య పట్ల మొగ్గు చూపితే, అల్లాహ్ కూడా వారి మధ్య సంబంధం మెరుగుపడేలా చేస్తాడు. అలాగే ఇరువురి తరపునుంచి సయోధ్య కోసం ప్రయత్నించే పెద్ద మనుషులు నిజాయితిగా సమస్య పరిష్కరించాలని ప్రయత్నిస్తే అల్లాహ్ తప్పక ఆ ప్రయత్నం ఫలించేలా చేస్తాడు.


పైన పేర్కొన్న దివ్యఖుర్ఆన్ వాక్యం రెండు కుటుంబాలకు సంబంధించినది. రెండు కుటుంబాలకు చెందిన పెద్ద మనుషులు సయోధ్యకు ప్రయత్నించాలని ప్రబోధిస్తుంది. ఈ ఖుర్ఆన్ వాక్యం పూర్తి ముస్లిమ్ సమాజాన్ని ఉద్దేశించి చేసిన ప్రబోధం కూడాను. ఒకవేళ వ్యవహారం న్యాయస్థానం వరకు వెళ్ళితే అప్పుడు న్యాయస్థానం కూడా మధ్యవర్తులను నియమించవచ్చు. వాళ్ళు సయోధ్య కోసమే ప్రయత్నించాలి. వాళ్ళు దంపతులకు సలహాలు, సూచనలు, మంచిమాటలు చెప్పగలరే తప్ప తీర్పు చెప్పలేరు. తుది నిర్ణయం తీసుకునే హక్కు కేవలం దంపతులకు మాత్రమే ఉంది. ఏది ఏమైనా ఇది ఆచరించవలసిన, అభిలషణీయమైన పని.

సమస్య పరిష్కారానికి ప్రయత్నాల తర్వాత కూడా, సయోధ్య ప్రయత్నాల తర్వాత కూడా దంపతులు కలిసి ఉండలేకపోతే, సంబంధం నిలబడే పరిస్థితి లేకపోతే, అప్పుడు ఇస్లామ్ పురుషుడికి తలాక్ అవకాశాన్ని, స్త్రీకి ఖులా అవకాశాన్ని ఇస్తుంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు తీవ్రమై, సంబంధం పూర్తిగా దిగజారిన తర్వాత కూడా, వారిద్దరు కలిసి బతకడం దుర్భరమైపోయిన తర్వాత కూడా విడాకులకు అవకాశం లేదని ఇస్లామ్ చెప్పలేదు.

ఇస్లామ్ ప్రతిపాదించిన కుటుంబ వ్యవస్థ ఒక సమగ్రమైన వ్యవస్థ. ప్రేమ, నిజాయితీ, నైతికత, చట్టాల పునాదులపై ఈ వ్యవస్థను నిలబెట్టింది. అనేక కుటుంబాలు కలిస్తే సమాజం ఏర్పడుతుంది. కుటుంబ పరిధిలో ఇస్లామీయ ఆదేశాలు అమలైతే యావత్తు సమాజంపై దాని ప్రభావం పడుతుంది. సామాజిక వాతావరణంలో అలుముకున్న చెడుల వల్ల ముస్లిమ్ కుటుంబాలు కూడా ప్రభావితమవుతున్నాయి. ఇస్లామీయ బోధనల పట్ల నిర్లక్ష్యం పెరుగుతోంది. నేడు చెడులు అలుముకున్న వాతావరణం మన చేతుల్లో లేదు. కాని కుటుంబ పరిధిలో అల్లాహ్ మనకు ఇచ్చిన అవకాశాలు, అధికారాలను మనం సక్రమంగా వినియోగించుకుంటే, కుటుంబాన్ని ఇస్లామీయ బోధనల ప్రకారం నడిపితే పూర్తి సమాజం దానివల్ల ప్రభావితమవుతుంది. ఇస్లామీయ ప్రభావం అన్నింటా కనబడడం ప్రారంభమవుతుంది.

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ప్రచురించిన "దివ్యఖుర్ఆన్- కుటుంబ వ్యవస్థ" పుస్తకంలో మౌలానా జలాలుద్దీన్ ఉమరీ ఇలాంటి అనేక విషయాలను చర్చించారు.**

# ఆజాద్ హింద్ ఫౌజ్: ముస్లిం పోరాట యోధులు"




## గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం "సాహితీ పురస్కారం"

ప్రముఖ చరిత్రకారుడు, పలనాడు జిల్లా పిడుగురాళ్ల నివాసి సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించిన "ఆజాద్ హింద్ ఫౌజ్ (భారత జాతీయ సైన్యం): ముస్లిం పోరాట యోధులు" పరిశోధనాత్మక చరిత్ర గ్రంథానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం "సాహితీ పురస్కారం" ప్రకటించింది. విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తంగెడ కిషన్ రావు స్వయంగా నశీర్ అహమ్మద్‌కు వర్తమానం అందించారు. ప్రతి ఏటా విశ్వవిద్యాలయం ప్రకటించే సాహితీ పురస్కారాలలో భాగంగా "వచన ప్రక్రియ" విభాగంలో 2022కు గాను ఈసారి 2019లో నశీర్ రచించిన 484 పుటల చరిత్ర గ్రంథం ఎన్నికయ్యింది. తన కళాశాల సహాధ్యాయి శ్రీ వియస్సార్ అవధాని సహకారంతో ముద్రితమైన ఈ గ్రంథాన్ని దేశంలోని సుమారు 400 గ్రంథాలయాలకు "చిరుగానుక"గా అందించారు.



ప్రస్తుత సాహితీ పురస్కారాన్ని హైదరాబాదులోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో త్వరలో జరిగే పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో 20,116 రూపాయల నగదుతోపాటు, పురస్కార జ్ఞాపికను అందజేసి నశీర్ అహమ్మద్‌ను విశ్వవిద్యాలయం సత్కరిస్తుంది.

గతంలో "పరిశోధన విభాగం"లో నశీర్ అహమ్మద్ రచనలకు గుర్తింపుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మక "కీర్తి పురస్కారం" లభించగా ప్రస్తుతం "సాహితీ పురస్కారం" నశీర్‌కు దక్కటం చరిత్ర రచనలో ఆయన కృషికి నిదర్శనం.

గత 30 ఏండ్ల నుండి "భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జనావళి పాత్ర"ను వివరిస్తూ నశీర్ అహమ్మద్ ఇప్పటి వరకు తెలుగులో 23 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి వెలువరించారు. ఆ గ్రంథాలలో కొన్ని ఆంగ్లం, కన్నడం, ఉర్దూ, తమిళం, గుజరాతీ, మరాఠీ భాషల్లో అనువాదమై ప్రచురితం అయ్యాయి. ఆయన గ్రంథాల రచన, ప్రచురణ, పంపిణితో సరిపెట్టుకోకుండా ఆయా గ్రంథాలలోని చారిత్రక సమాచారాన్ని వివిధ ప్రచార – ప్రసార మాధ్యమాల ద్వారా దేశంలోని ప్రజల వద్దకు చేరటానికి విశేష కృషి చేస్తున్నారు. మిత్రులు, వదాన్యుల ఆర్థిక చేయూతతో ఈ గ్రంథాలను దేశంలో మాత్రమే కాకుండా విదేశాలలోని ఎంపిక చేసిన వందలాది గ్రంథాలయాలకు కానుకగా అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు తన గ్రంథాల పిడిఎఫ్ ఫైళ్ళను సుమారు 30 వేల మంది పాఠకులకు వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందజేసారు.

# ఈ సృష్టి అద్భుతం



**రుఫైదా**

**విశ్వ** ఆవిర్భవానికి సంబంధించి శాస్త్రవేత్తలు ఏమంటారంటే, మొదట వేడిగాలి ఉండేది. ఈ వేడిగాలి సాంద్రత పెరుగుతూ పోయింది. సాంద్రత పెరుగుతూ కుచించుకు పోతున్నప్పుడు ఇది చిన్న చిన్న భాగాలుగా విడిపోయి గాలక్టిక్ పదార్థం ఏర్పడింది. అలా గ్యాలక్సీల నుంచి ఈ పదార్థం మరింత కుచించుకుపోయి నక్షత్రాలు ఏర్పడ్డాయి. గ్రహాలు ఏర్పడ్డాయి. మరోవిధంగా చెప్పాలంటే, మన భూమి, ఈ నక్షత్రాలు ఇవన్నీ ఒకే పదార్థం నుంచి వేరుపడ్డాయి. అది వేడిగాలి రూపంలో ప్రారంభంలో ఉన్న పదార్థం. అందులోనుంచే నక్షత్రాలు ఏర్పడ్డాయి. మన సూర్యుడు ఒక నక్షత్రమే. దీని చుట్టు ఉన్న గ్రహాలను కలిపి సూర్య కుటుంబం అంటున్నాం. ఇలాగే నక్షత్రాలకు కూడా గ్రహ మండలాలు ఉన్నాయి. అంటే అనేక సూర్యకుటుంబాలు విశ్వంలో ఏర్పడ్డాయి. అనేక గ్యాలక్సీలు ఉన్నాయి. మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లు ఈ విశ్వం ప్రారంభంలో "రత్" అనే రూపంలో ఉండేది. రత్ అంటే ఫ్యూజన్, అన్ని కలిసిపోయి సమైక్యంగా ఒకేచోట ఉండడం. ఆ తర్వాత ఇది "ఫతాఖా" దశలోకి ప్రవేశించింది. ఫతాఖా అంటే విడిపోవడం. అనేక భాగాలుగా విడిపోవడాన్ని ఫతాఖా అంటారు. విశ్వం ఎలా ఏర్పడింది? విశ్వావిర్భావం ఎలా జరిగింది అనే విషయాలను దివ్య ఖుర్ఆన్ చాలా స్పష్టంగా వివరించింది. చాలా ఖచ్చితంగా వర్ణించింది. నేడు వైజ్ఞానిక ఆవిష్కరణలు దివ్యఖుర్ఆన్‌లో ప్రస్తావించిన ఈ వర్ణనను ఆమోదిస్తున్నాయి.

ఇప్పుడు మరో ముఖ్యమైన విషయం చూద్దాం. ఒక పదార్థం అనేక భాగాలుగా విడిపోతున్నప్పుడు, కొన్ని కణాలు చెల్లాచెదురు అవుతాయి. అవి ఏ భాగంలోను చేరకుండా మిగిలిపోతాయి. అలాగే రోదసిలో వేడిగాలుల ప్రాథమిక పదార్థం సాంద్రత పెరిగి కుచించుకుంటూ అనేక భాగాలుగా విడిపోతున్న ప్రక్రియలోను చెల్లాచెదరై పోయిన కణాలు కూడా చాలా ఉన్నాయి. ఈ కణాలను సైన్సులో ఇంటర్ గాలక్టిక్ మెటీరియల్ అంటారు. అంటే గ్యాలక్సీల మధ్య మిగిలిపోయిన పదార్థం. అలాగే నక్షత్ర రాసుల మధ్య కూడా మిగిలిపోయిన పదార్థం చాలా ఉండిపోయింది. ఈ పదార్థంలో 60 శాతం హైడ్రోజన్, 38 శాతం హీలియం, 2 శాతం ఇతర మూలకాలుంటాయని సైన్సు చెబుతోంది. ఇంటర్ స్టెల్లార్ మ్యాటర్ అంటే నక్షత్రాల మధ్య మిగిలిపోయిన ద్రవ్యంలో 99 శాతం వాయువులే ఉన్నాయి. మిగిలిన 1 శాతం ధూళి కణాలున్నాయి. ఇందులో భార మూలకాలు అంటే హెవీ ఎలిమెంట్స్ ఉంటాయని సైన్సు చెబుతుంది. ఈ భార మూలకాలు 0.0001 నుంచి 0.001 మి.మి.వ్యాసం కలిగి ఉండవచ్చు. ఆస్ట్రో ఫిజికల్, అంతరిక్ష భౌతికశాస్త్రంలో కొలమానాల విషయంలో ఈ కణాలు చాలా కీలకమైనవిగా శాస్త్రవేత్తలు భావిస్తారు. ఈ కణాలు చాలా చిన్నవి కాబట్టి వీటిని ధూళి కణాలుగా చెప్పవచ్చు. లేదా పొగ లేదా వాయుకణాలుగా కూడా చెప్పవచ్చు. ఈ కణాలు చాలా చిన్నవే కాని, నిజానికి ఇవి చాలా

ఎక్కువ. వీటన్నింటిని కలిపితే చాలా ద్రవ్యం ఉంటుంది. అంతరిక్షంలో ఉన్న గ్యాలక్సీలన్నింటిలో ఉన్న ద్రవ్యం కన్నా, ఈ ధూళి కణాలు అన్నింటిని కలిపితే ఉండే ద్రవ్యం ఎక్కువ. గ్యాలక్సీల మధ్య ఈ ద్రవ్యరాశి చిన్న చిన్న కణాల రూపంలో ధూళి కణాలుగా ఉందన్నది 1920లో కనిపెట్టిన విషయం. కాని వందల సంవత్సరాల క్రితం దివ్యఖుర్‌ఆన్ ఈ ద్రవ్యాన్ని ప్రస్తావించింది. ఖుర్‌ఆన్‌లోని “మాబైనహుమా” అంటే “వాటి మధ్య ఉన్న సమస్తం” అనే మాటలు దీనికి సంబంధించినవే.

విశ్వంలో ఒక ఖచ్చితమైన సమతుల్యం కూడా మనకు కనిపిస్తుంది. ఇదే విషయాన్ని దివ్యఖుర్‌ఆన్ 67వ సూరా అల్ ముల్క్‌లో 3వ వాక్యం, 4వ వాక్యంలో అల్లాహ్ తెలియజేశాడు.

“ఆయన పొరలుగా ఏడు ఆకాశాలను సృష్టించాడు. అనంత కరుణామయుడి సృష్టిలో నీవు ఎలాంటి లోపాన్ని చూడలేవు. మరోసారి చూడు అందులో నీకేమైనా లోపం కనిపిస్తున్నదా? మళ్లీ మళ్లీ చూడు, నీ చూపులు అలసిపోయి విఫలమై వెనుకకు తిరిగి వస్తాయి.” (దివ్య ఖుర్‌ఆన్ : 67:3-4)

విశ్వంలోని కోటానుకోట్ల నక్షత్రాలు ఖచ్చితమైన సమతుల్యంతో కదులుతున్నాయి. విశ్వంలో తమకు నిర్దేశించిన కక్ష్యల్లో మార్గాల్లోనే తిరుగుతున్నాయి. నక్షత్రాలు, గ్రహాలు, గ్యాలక్సీలు తమ కక్ష్యల్లో ప్రయాణించడమే కాదు, తమ చుట్టు తాము కూడా తిరుగుతున్నాయి. ఇవన్నీ ఒక మహావ్యవస్థలో భాగంగా కదులుతున్నాయి. కొన్ని గ్యాలక్సీల్లో 20 నుంచి 30 కోట్ల నక్షత్రాలుంటాయి. ఇంత భారీ గ్యాలక్సీలు ఒక దాని మార్గాన్ని ఒకటి దాటడం కూడా జరుగుతుంది. కాని అవి ఢీకొనవు. అవి కనుక ఢీకొంటే విశ్వం అతలాకుతలమైపోతుంది. విశ్వంలోని క్రమబద్ధత చెల్లాచెదరవుతుంది. ఇది మనమంతా ఆలోచించవలసిన మిరకిల్. ఒక మహత్యం కాకపోతే మరేమిటి?

విశ్వంలో వేగం అనేది చాలా చాలా ఎక్కువ. మనం నమ్మలేని వేగాలున్నాయి. భూమిపై వేగంతో దాన్ని పోల్చలేము. నక్షత్రాలు, గ్రహాలు, గ్యాలక్సీలు, అనేక గ్యాలక్సీలున్న సముదాయాలు వాటి పరిమాణం మనం ఊహలకు అందనిది. ఎంత బరువుంటాయన్నది కూడా ఊహించలేం. కోటానుకోట్ల టన్నుల బరువని చెప్పగలమేమో. ఈ భారీ నిర్మాణాలు గొప్ప వేగంతో విశ్వంలో కదులుతున్నాయి.

ఉదాహరణకు, మన భూమిని తీసుకుందాం. భూమి తన చుట్టు తాను తిరుగుతోంది. ఎంత వేగంతో తిరుగుతుందో తెలుసా? గంటకు 1670 కి.మీ. వేగంతో తిరుగుతోంది. ఇంత వేగంగా ప్రయాణించే వాహనం ఏదైనా భూమిపై ఉందా? లేనే లేదు. అత్యంత వేగంగా వెళ్ళే బుల్లెట్ గంటకు 1800 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. భూమి ఎంత వేగంగా తన చుట్టు తాను తిరుగుతుందో దీన్ని బట్టి ఊహించవచ్చు.

భారీ పరిమాణంలో ఉన్న భూమి ఇంత వేగంగా తన చుట్టు తాను తిరగడమే కాదు, సూర్యుని చుట్టు కూడా తిరుగుతోంది. భూమి సూర్యుని చుట్టు తిరిగే వేగం ఇంకా చాలా చాలా ఎక్కువ. అత్యంత వేగంగా ప్రయాణించే బుల్లెట్ కన్నా 60 రెట్లు ఎక్కువ వేగంతో భూమి సూర్యుని చుట్టు తిరుగుతోంది. అంటే భూమి సూర్యుని చుట్టు 1,08,000 కి.మీ.వేగంతో తిరుగుతోంది.

ఇంత వేగంతో ప్రయాణించే వాహనాన్ని మనం తయారు చేయగలిగితే భూమి చుట్టు ఒకసారి తిరిగి రావడానికి కేవలం 22 నిముషాలు పడుతుంది. ఇవి కేవలం భూమికి సంబంధించిన వేగాలు మాత్రమే. సౌరకుటుంబంలో కనిపించే వేగాలు మనం ఊహించలేనివి. విచిత్రమేమంటే విశ్వంలో పరిమాణంలో పెద్దదైన ప్రతి నిర్మాణం వేగంలోను మిగిలిన వాటి కన్నా ఎక్కువ వేగం కలిగి ఉంటోంది. మన సౌరకుటుంబాన్నే తీసుకుందాం. ఇందులో సూర్యుడు, దాని చుట్టు తిరిగే గ్రహాలు, తోకచుక్కలు అన్నీ కలిసి ఉన్నాయి. ఈ మొత్తం సౌరకుటుంబం కూడా ఇది ఉన్న గ్యాలక్సీ పాలపుంత కేంద్రం చుట్టు తిరుగుతోంది. ఎంత వేగంతో తెలుసా? గంటకు 7,20,000 కి.మీ. వేగంతో తిరుగు తోంది. మన సౌర కుటుంబం ఉన్న గ్యాలక్సీ పేరు పాలపుంత. ఇందులో దాదాపు 20 కోట్ల కన్నా ఎక్కువ నక్షత్రాలున్నాయి. ఈ మొత్తం గ్యాలక్సీ కూడా ప్రయాణిస్తోంది. ఎంత వేగంతోనో తెలుసా? గంటకు 9,50,000 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది.

ఇంత సంక్లిష్టమైన వ్యవస్థలో, ఇంత వేగంగా నిర్మాణాలు కదులుతున్న వ్యవస్థలో ఒకదాన్నొకటి ఢీకొనే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి. కాని అలా జరగడం లేదు. మనం సురక్షితంగా భూమిపై బతుకుతున్నాం. ఎందువల్లనంటే విశ్వంలో అన్నీ ఖచ్చితమైన సమతుల్యంతో వ్యవహరిస్తున్నాయి. ఈ సమతుల్యాన్ని ప్రసాదించింది అల్లాహ్. అందువల్లనే ఇంతకు ముందు చెప్పుకున్న దివ్యఖుర్‌ఆన్ వాక్యంలో “ఇందులో ఎలాంటి లోపం చూడలేరు” అని అల్లాహ్ తెలియజేశాడు.

“ఆయన పొరలుగా ఏడు ఆకాశాలను సృష్టించాడు. అనంత కరుణామయుడి సృష్టిలో నీవు ఎలాంటి లోపాన్ని చూడలేవు. మరోసారి చూడు అందులో నీకేమైనా లోపం కనిపిస్తున్నదా? మళ్లీ మళ్లీ చూడు, నీ చూపులు అలసిపోయి విఫలమై వెనుకకు తిరిగి వస్తాయి.” (దివ్యఖుర్‌ఆన్ : 67:3-4)

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**